మంగళవారం
21-02-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 240
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

ఉక్రెయిన్‌లో జో బైడెన్

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సోమవారం ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో ఆకస్మిక పర్యటన చేపట్టారు. ఉక్రెయిన్-రష్యా మధ్య యుద్ధం మొదలైన తర్వాత అగ్రరాజ్యం అధ్యక్షుడు జో బైడెన్.. ఇక్కడ పర్యటించడం ఇదే తొలిసారి. ఉక్రెయిన్-రష్యాల మధ్య యుద్ధం మొదలైన ఫిబ్రవరి 24తో ఏడాది పూర్తికావస్తున్న వేళ... జో బైడెన్ కీవ్‌లో పర్యటించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

2లో

అమరరాజా బ్యాటరీస్‌పై ప్రజాభిప్రాయసేకరణ

సుప్రీంకోర్టు ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఏపీకి చెందిన అమరరాజా బ్యాటరీస్ వ్యవహారంలో ప్రజాభిప్రాయ సేకరణ జరిపిన తర్వాతే చర్యలపై నిర్ణయం తీసుకోవాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలిని సుప్రీంకోర్టు ఆదేశించింది. అయితే సంస్థ మూసివేతపై హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు మాత్రం యధాతథంగా కొనసాగుతాయని స్పష్టం చేసింది. అమరరాజా బ్యాటరీస్ తీవ్ర కాలుష్యం వెదజల్లుతోందని, దీనివల్ల పరిసర ప్రాంతాల జలాల్లో సీసం ధాతువులు పెరుగుతున్నందున సంస్థను మూసివేయాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి గతంలో ఆ కంపెనీ యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఆ నోటీసులపై చట్ట ప్రకారం ముందుకు వెళ్లవచ్చని హైకోర్టు తీర్పు ఇచ్చింది. దీనిని సవాల్ చేస్తూ అమరరాజా బ్యాటరీస్ సంస్థ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా అమరరాజా తరపున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, ఆదినారాయణరావు వాదించారు. కేవలం రాజకీయ కారణాలతో రాష్ట్ర ప్రభుత్వ ఒత్తిడితో పర్యావరణశాఖ అధికారులు ఇప్పటివరకు దాదాపు 34సార్లు నోటీసులు ఇచ్చి కంపెనీ యాజమాన్యాన్ని వేధిస్తున్నారని కోర్టు దృష్టికి తెచ్చారు. వాస్తవానికి కాలుష్య నివారణకు అవసరమైన అన్నిరకాల చర్యలు సంస్థ తీసుకుంటుందని

- మిగతా 2 లో

పోలవరం

పాలకుల నిర్లక్ష్యం

- నిధులు ఇవ్వడంలో కేంద్రం జాప్యం
- ప్రాజెక్టు నిర్మించే వరకు విశ్రమించం: రామకృష్ణ
- ప్రాజెక్టు పనులు పరిశీలించిన సీపీఐ బృందం

విశాలాంధ్ర బ్యూరో- ఏలూరు: తెలుగు ప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా సోమవారం రామకృష్ణ అధ్వర్యంలో పార్టీ ప్రతినిధి బృందం పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించింది. స్పిల్ వే, ఎగువ, దిగువ, కాపర్ డ్యాం పనులను స్వయంగా పరిశీలించింది. పోలవరం ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ సుధాకర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆదిరెడ్డి ప్రాజెక్టు పనులను మ్యాప్, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం రామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ కృష్ణా, గోదావరి నదుల అనుసంధానంతో రాష్ట్రంలోని 26 జిల్లాల ప్రయోజనాలు ముడిపడి ఉన్నాయని తెలిపారు. పోలవరం పూర్తి అయితే 7 లక్షల ఎకరాలకు సాగునీరు, వందలాది గ్రామాలకు, పట్టణాలకు తాగునీరు, ఉత్తరాంధ్ర, రాయలసీమకు నీరు లభిస్తుందన్నారు. రాష్ట్ర విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిందన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తున్నదని రామకృష్ణ విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ కార్యాలయం హైదరాబాదులో ఉందని, ఈ కార్యాలయాన్ని రాజమండ్రికి మారుస్తామని హామీ ఇచ్చారని, కానీ నేటికీ అమలు చేయలేదని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులలో ఉన్నప్పటికీ పోలవరం ప్రాజెక్టుపై రూ.2900 కోట్లు ఖర్చు చేసిందని, ఆ నిధులు ఇవ్వాల్సిందిగా ఆర్థిక మంత్రి, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ముఖ్యమంత్రి జగన్ దిల్లీ చుట్టూ తిరుగుతున్నా మోదీ స్పందించడం లేదని విమర్శించారు. ప్రాజెక్టు ఎప్పటికి పూర్తవుతుందో ఎవరు చెప్పడం లేదన్నారు. కాపర్ డ్యాం నిర్మాణాలు ఇంకా పూర్తి కాలేదని, డయాఫ్రం వాల్‌లో నష్టం ఎంతో తెలియదన్నారు. మోసపూరిత మాటలు వల్లె వేయకుండా పోలవరం ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేమని జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు నిజం తెలిపినందుకు అభినందిస్తున్నానన్నారు. పోలవరం తెలుగు ప్రజల జీవనాడి అన్నారు. సీడబ్ల్యూసీ ఆమోదించి... ప్రాజెక్టు

- మిగతా 2 లో

నిర్లక్ష్యం నీడన ఆఫ్‌షోర్

నేడు సీపీఐ బృందం పర్యటన

8లో

ఎన్నికలే లక్ష్యంగా...

- బీసీలకు అధిక సీట్లు
- 18 మంది ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖరారు
- వారంలోనే జయమంగళకు అందలం
- పోతుల సునీతకు మళ్లీ చాన్స్
- గవర్నరు కోటాలో కుంభా రవి, కర్రి పద్మశ్రీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థలు, ఎమ్మెల్యే కోటా, గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థులను వైసీపీ సోమవారం ప్రకటించింది. 2024 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సామాజిక కోణంలో ఎమ్మెల్సీలను కేటాయించింది. ఎమ్మెల్సీ అభ్యర్థుల జాబితాలో సామాజిక సమతుల్యతను పాటించినట్లు కనిపించింది. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి...18 ఎమ్మెల్సీ స్థానాల అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. ఎమ్మెల్యే కోటాలో ఏడుగురు, స్థానిక కోటాలో తొమ్మిది మంది, గవర్నరు కోటాలో

- మిగతా 2 లో

అడ్వైజ్.. అసిస్ట్.. సపోర్టివ్

ఎంఎస్‌ఎంఈ నూతన పాలసీ

- పరిశ్రమ స్థాపన నుంచి మార్కెటింగ్ వరకు...
- స్టార్టప్ కాన్సెప్ట్‌కు ప్రోత్సాహం
- విశాఖలో భారీ భవన నిర్మాణం
- నూతన పారిశ్రామిక విధానంపై సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అడ్వైజ్, అసిస్ట్ అండ్ సపోర్టివ్‌గా ఎంఎస్‌ఎంఈ నూతన పాలసీ ఉండాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారులకు సూచించారు. నూతన పారిశ్రామిక అభివృద్ధి విధానంపై సోమవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో పరిశ్రమల శాఖ అధికారులతో సీఎం ప్రాథమిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన పాలసీ ఎలా ఉండాలనేదానిపై ముఖ్యమంత్రి కీలక సూచనలిచ్చారు. ముఖ్యంగా పరిశ్రమల స్థాపన మొదలు మార్కెటింగ్ వరకు పరిశ్రమలను చేయిపట్టుకుని నడిపించేలా పాలసీ ఉండాలన్నారు. నూతన పారిశ్రామిక అభివృద్ధి విధానంలో మార్కెటింగ్ టై అప్ విధానంపై దృష్టి సారించాలన్నారు. అంతర్జాతీయంగా మార్కెటింగ్ టైఅప్ చేయగలిగితే ఎంఎస్‌ఎంఈ రంగంలో మరింత మెరుగైన అభివృద్ధి సాధించగలుగుతామన్నారు. ఎంఎస్‌ఎంఈ రంగంలో పోటీ ఎక్కువగా ఉంటుందని, సరైన మార్కెటింగ్ చూపించగలిగితే ఈ రంగంలో పరిశ్రమలు మరింత రాణిస్తాయన్నారు. స్టార్టప్ కాన్సెప్ట్‌ను ప్రోత్సహించాలన్నారు. ఇందుకోసం విశాఖపట్నం నగరంలో మంచి ప్రాంతంలో సుమారు 3 లక్షల

- మిగతా 2 లో

గన్నవరం రణరంగం

పోలీసుల సాక్షిగా వైసీపీ శ్రేణుల వీరంగం

- తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి
- ఫర్నీచర్ ధ్వంసం. కారు దగ్ధం
- ధర్నాకు దిగిన టీడీపీ కార్యకర్తలు
- రెండువర్గాల బాహాబాహీ, రాళ్ల దాడులతో బీభత్సం
- గవర్నర్ జోక్యం చేసుకోవాలని చంద్రబాబు డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వైసీపీ శ్రేణుల అరాచకాలు పరాకాష్టకు చేరాయి. గతంలో టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి చేయడంతోపాటు చంద్రబాబు నివాసంపై దండెత్తిన అధికారపార్టీ శ్రేణులు సోమవారం కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ కార్యాలయంపై దాడికి పాల్పడ్డారు. కార్యాలయంలోని కంప్యూటర్లు, ఫర్నీచర్ ధ్వంసం చేశారు. అంతటితో ఆగకుండా ఆఫీస్ ఆవరణలో ఉన్న వాహనాలపై పెట్రోల్‌తో నిప్పంటించారు. టీడీపీ ఫ్లెక్సీలు చించివేశారు. కారు అద్దాలను ఇటుకలతో బద్దలు కొట్టారు. పార్టీ కార్యాలయం మొత్తాన్ని కొద్దిసేపట్లోనే ధ్వంసం చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు, పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్‌పై గన్నవరం శాసనసభ్యులు వల్లభనేని వంశీ తీవ్ర పరుష పదజాలంతో విమర్శలు చేశారు. దానిపై స్థానిక టీడీపీ నేతలు స్పందిస్తూ మరింత ఘాటుగా ప్రతి విమర్శలు చేశారు. దీనిపై ఆగ్రహం చెందిన వంశీ అనుచరులు తమ నేతనే విమర్శిస్తారా ? అంటూ టీడీపీ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి దాడికి పాల్పడ్డారు. ఆ సమయంలో టీడీపీ నేతలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అదే అదనుగా భావించిన వైసీపీ శ్రేణులు విధ్వంసానికి పాల్పడ్డారు. ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహోదగ్రులైన తెలుగు తమ్ముళ్లు జాతీయ రహదారిపై బైఠాయించి నిరసనకు దిగారు. ఎమ్మెల్యే వల్లభనేని వంశీ సహా టీడీపీ

- మిగతా 2 లో

ఉమ్మడి ఆప్షన్‌కు ఓకే

అధిక పింఛన్‌పై ఈపీఎఫ్‌ఓ కీలక ప్రకటన

న్యూఢిల్లీ: ఉద్యోగుల పెన్షన్ పథకం కింద అధిక పింఛన్ పొందే అంశంపై ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) సోమవారం కీలక ప్రకటన చేసింది. ఉద్యోగులకు, సంస్థలకు ఉమ్మడి ఆప్షన్ అవకాశాన్ని కల్పించింది. అధిక పింఛన్ విషయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అనుసరించి ఈ ఉత్తర్వులు జారీ చేస్తున్నట్లు ప్రకటించింది. ఉమ్మడి ఆప్షన్ ప్రక్రియను పర్యవేక్షించే బాధ్యతను ప్రాంతీయ కార్యాలయాలకు అప్పగించింది. ఈపీఎఫ్ చట్టంలోని పేరా 11(3) ప్రకారం 2014 నాటి సవరణకు ముందు గరిష్ఠ వేతన పరిమితి రూ.6500గా ఉంది. 2014లో గరిష్ఠ వేతన పరిమితిని రూ.15 వేలకు పెంచుతూ సవరణ చేసింది. గరిష్ఠ పరిమితితో సంబంధం లేకుండా అంతకు మించి వేతనం పొందుతున్న ఉద్యోగులు ఈపీఎస్‌లో జమ చేసేందుకు అవకాశం కల్పించింది. అధికవేతనంపై ఈపీఎస్‌లో చేరేందుకు ఆప్షన్ ఇవ్వాలని సూచించింది. అప్పట్లో దీనికి గడువేదీ పేర్కొనలేదు. అయితే, 2014 సవరణ నాటికి ఈ పథకంలో చేరని ఉద్యోగులకు ఆప్షన్ ఇచ్చేందుకు ఈపీఎఫ్ఓ

- మిగతా 2 లో

ఇదీ లోకం!

విలీనం, విలీనం, విలీనం
నేను పెద్దయ్యేటప్పటికి
అసలు స్కూళ్లు ఉంచుతారా
పూర్తిగా ఊడబెరుకుతారా?

ఎన్‌పీఎస్ నిధులు ఇచ్చేది లేదు

మోదీ సర్కారు మొండి వైఖరి

జైపూర్: జాతీయ పింఛను విధానం(ఎన్‌పీఎస్) విషయంలో కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోంది. రాష్ట్రాల ప్రభుత్వ ఉద్యోగుల నుంచి ఎన్‌పీఎస్ కింద జమ అయిన చందాల సొమ్మును తిరిగి రాష్ట్రాలకు ఇచ్చేది లేదని చెబుతోంది. ఎన్‌పీఎస్ నిధులను తిరిగిస్తారని రాష్ట్రాలు అంచనా పెట్టుకోవద్దని, అది అసాధ్యమని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. రాజస్థాన్ వేదికగా అనేక రంగాల వాటాదారులతో జరిగిన బడ్జెట్ అనంతర చర్చల్లో నిర్మలా సీతారామన్ పాల్గొన్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ 'జాతీయ పింఛను విధానం కింద ఉద్యోగుల ఈపీఎఫ్‌వో నుంచి జమ అయిన మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం తిరిగివ్వాలని రాష్ట్రాలు కోరుతున్నాయి. ఇలాంటి అంచనాలేమైనా రాష్ట్రాలకు ఉంటే..అది సాధ్యపడదని చెబుతున్నా. ఆ డబ్బుపై అధికారం ఉద్యోగులదే. ఆ డబ్బులకు వడ్డీ వస్తుంది. పదవీ విరమణ తర్వాతే ఆ డబ్బు ఉద్యోగుల చేతికి వస్తుంది. ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వాల చేతికి ఇవ్వడం అనేది కుదరదు' అని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. అనంతరం దీనిపై ఆర్థికశాఖ కార్యదర్శి వివేక్ జోషీ స్పందిస్తూ కొన్ని రాష్ట్రాలు పాత పింఛను విధానాన్ని అమలు చేయడం, కేంద్రం కూడా అదే విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఎన్‌పీఎస్ నిధుల్లో తమ వాటా సొమ్మును వెనక్కి ఇవ్వాలని కొన్ని రాష్ట్రాలు డిమాండ్ చేస్తున్నాయని, అయితే ప్రస్తుతమున్న చట్టపరమైన

- మిగతా 2 లో

చట్టం వారికి చుట్టం!

విశాలాంధ్ర బ్యూరో -విశాఖపట్నం: అధికారం ఉండగా తామేది చేసినా అడ్డుకునే వారే ఉండరన్న రీతిలో విశాఖ వైసీపీ ప్రజా ప్రతినిధుల వ్యవహార శైలి ఉందని సర్వత్రా విమర్శలు వెలువెత్తుతున్నాయి. నిబంధనలు, చట్టాలు, జీవోలు కేవలం పేదలకు మాత్రమే వర్తిస్తాయా అంటూ సామాన్య ప్రజలు, విపక్షాల నేతలు పెదవి విరుస్తున్నారు. అధికార బలంతో నిబంధనలు ఉల్లంఘించి అడ్డదారిలో కొంతమంది వైసీపీ ప్రజాప్రతినిధులు చేపడుతున్న పనులకు అధికారులు వత్తాసు పలకడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. మహా విశాఖ నగరంలో పేదలపై చెత్త చార్జీలు, ఇంటి పన్నుల భారం వేసిన వైసీపీ ప్రభుత్వం... తమ ప్రజాప్రతినిధులకు మాత్రం నిబంధనలు అమలు చేయకుండా జీవీఎంసీ కి రావలసిన ఆదాయానికి గండి కొడుతున్నారని విశాఖ నగర ప్రజలు, విపక్షాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. సాక్షాత్తు నగర మేయర్ హరి వెంకట కుమారి భర్త పేరు మీద ఉన్న భవనానికి ఇంటి పన్ను విధించడంలో జీవీఎంసీ అధికారులు అత్యుత్సాహం

- అధికార పార్టీ అక్రమాలకు అధికారుల వత్తాసు
- జీవీఎంసీ ఆదాయానికి గండి
- పేదలకు ఓ న్యాయం... పెద్దలకు మరో న్యాయమా?
- మండిపడుతున్న విపక్షాలు

- మిగతా 2 లో

వ్యాపార కేంద్రాలుగా సైనిక స్థావరాలు

తాలిబన్ ప్రభుత్వం వెల్లడి

కాబూల్: అఫ్గానిస్తాన్‌లో వ్యాపారాలను అభివృద్ధి చేయడంపై తాలిబన్లు దృష్టి సారించారు. గతంలో విదేశీ సైన్యాలు స్థావరాలుగా ఉపయోగించిన ప్రదేశాలను వ్యాపారాల కోసం ఆర్థిక మండళ్లుగా మార్చనున్నట్లు తాలిబన్ ప్రభుత్వం పేర్కొంది. ఈ విషయాన్ని తాలిబన్ ఉప ప్రధాని ముల్లా అబ్దుల్ ఘనీ బరాదర్ ప్రకటించారు. 'విదేశీ సైనిక స్థావరాలను ప్రత్యేక ఆర్థిక మండళ్లుగా మార్చాలనే ఉద్దేశంతో వాణిజ్య, పరిశ్రమల శాఖ స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించింది. ప్రస్తుతం కాబుల్, ఉత్తర బాల్క్ ప్రావిన్స్‌ల్లోని స్థావరాలను తొలుత మార్చనున్నాం' అని ఆయన పేర్కొన్నారు. 2021లో అమెరికా, నాటో దళాలు అఫ్గాన్‌ను వీడి వెళ్లిపోయిన తర్వాతి నుంచి ఆ దేశంలో ఆర్థిక కష్టాలు తీవ్రమయ్యాయి. విదేశీ ఆర్థిక సాయం నిలిచిపోవడంతోపాటు.. అమెరికా వద్ద ఉన్న అఫ్గాన్ నిధులను స్తంభింప చేశారు. దీంతో తాలిబన్లు నిధుల కోసం మార్గాలను వెతుకుతున్నారు. ఈ క్రమంలో అమెరికా, నాటో సైనిక స్థావరాలపై ఓ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు గతేడాది డిసెంబర్‌లో ఆ దేశ వాణిజ్య మంత్రి వెల్లడించారు. మరోవైపు దేశంలో ఉన్న 1 ట్రిలియన్ డాలర్ల సహజ సంపద వెలికితీతపై దృష్టిపెట్టింది. ఈక్రమంలో చైనాతో ఓ ఒప్పందం కూడా చేసుకొంది. తాము ఆర్థిక వ్యవస్థను వృద్ధి చేయడంపై దృష్టిపెట్టామని తాలిబన్ ప్రభుత్వం పేర్కొంది. ముఖ్యంగా స్వయం సమృద్ధితో పాటు విదేశీ పెట్టుబడులను ఆకర్షించాలనుకొంటున్నామని తెలిపింది. ఈ క్రమంలో ఇస్లామిక్ స్టేట్ ఉగ్రసంస్థ జరుపుతున్న దాడులపై ఆందోళన వ్యక్తం చేసింది.

ఉక్రెయిన్‌లో జో బైడెన్

కీవ్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సోమవారం ఉక్రెయిన్ రాజధాని కీవ్‌లో ఆకస్మిక పర్యటన చేపట్టారు. ఉక్రెయిన్-రష్యా మధ్య యుద్ధం మొదలైన తర్వాత అగ్రరాజ్యం అధ్యక్షుడు జో బైడెన్.. ఇక్కడ పర్యటించడం ఇదే తొలిసారి. ఉక్రెయిన్-రష్యాల మధ్య యుద్ధం మొదలైన ఫిబ్రవరి 24తో ఏడాది పూర్తికావస్తున్న వేళ... జో బైడెన్ కీవ్‌లో పర్యటించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అయితే తాను ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని కలవనున్నట్టుగా జో బైడెన్ చెప్పారు. 'ఉక్రెయిన్ ప్రజాస్వామ్యం, సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రత పట్ల మా అచంచలమైన నిబద్ధతను పునరుద్ఘాటించడానికి నేను ఈ రోజు కీవ్‌లో ఉన్నాను' అని బైడెన్ చెప్పారు. అదే సమయంలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై కూడా విమర్శలు గుప్పించారు. 'దాదాపు ఒక సంవత్సరం క్రితం పుతిన్ తన

దండయాత్రను ప్రారంభించినప్పుడు... ఉక్రెయిన్ బలహీనంగా ఉందని, పశ్చిమ దేశాలు విభజించబడ్డాయని భావించాడు. అతను మమ్మల్ని అధిగమించగవచ్చని అనుకున్నాడు. కానీ ఆయనది పూర్తిగా తప్పుడు అభిప్రాయం' అని బైడెన్ పేర్కొన్నారు. 'గత సంవత్సరం కాలంగా అపూర్వ సైనిక, ఆర్థిక, మానవతా మద్దతుతో ఉక్రెయిన్‌ను రక్షించడంలో సహాయపడటానికి అట్లాంటిక్ నుంచి పసిఫిక్ వరకు దేశాల కూటమిని యునైటెడ్ స్టేట్స్ నిర్మించింది. ఆ మద్దతు కొనసాగుతుంది' అని బైడెన్ చెప్పారు. ఉక్రెయిన్ సరిహద్దు దేశం పోలాండ్‌లోనూ బైడెన్ పర్యటించనున్నారు. అక్కడ ఆ దేశ అధ్యక్షుడు ఆంద్రేజ్ దుడాతో ఆయన సంప్రదింపులు జరపనున్నారు. బైడెన్‌తో కరచాలనం చేస్తున్న ఫోటోను ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తన టెలిగ్రామ్ అకౌంట్‌లో పోస్టు చేశారు.

మరోసారి బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించిన ఉత్తర కొరియా

సియోల్: వరుస క్షిపణి ప్రయోగాలతో ఉత్తర కొరియా... తన శత్రు దేశాలకు వణుకు పుట్టిస్తున్నది. రోజురోజుకు ఆయుధ సంపత్తిని పెంచుకుంటూ తన జోలికొస్తే ఊరుకునేది లేదంటూ అమెరికా, దక్షిణ కొరియా పాలకులకు హెచ్చరికలు జారీచేస్తున్నది. తాజాగా అణ్వా యుధ సామర్థ్యం కలిగిన ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించింది. అమెరికా-దక్షిణ కొరియా సంయుక్తంగా సైనిక విన్యాసాలు నిర్వహించిన 48 గంటల వ్యవధిలోనే అణు క్షిపణిని ప్రయోగించినట్లు దక్షిణ కొరియా సైన్యం తెలిపింది. సోమవారం ఉదయం తూర్పుసముద్రం వైపు ఉత్తరకొరియా బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగిం చిందని సియోల్ జాయింట్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ వెల్లడించారు. ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని ఉత్తర కొరియా ప్రయోగించినట్లు జపాన్ ప్రధాని కార్యాలయం ట్వీట్ చేసింది. 66 నిమిషాల అనంతరం అది తమ ఎక్స్‌క్లూజివ్ ఎకనమిక్ జోన్‌లో పడిందని పేర్కొంది. కాగా ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ ఆదేశంతో హస్వాంగ్-15 ఖండాంతర క్షిపణిని ప్యాంగ్‌యాంగ్ విమానాశ్రయం నుంచి శనివారం మధ్యాహ్నం ప్రయోగించినట్లు అధికారిక మీడియా కేసీఎన్‌ఏ వెల్లడించింది. ఇది ప్యాంగ్యాంగ్ అణు సామర్థ్యాన్ని ప్రదర్శించిందని పేర్కొంది.

బ్రెజిల్‌లో భారీ వర్షాలు...36 మంది మృతి

బ్రసిలియా: బ్రెజిల్‌ను భారీ వర్షాలు అతలాకుతలం చేశాయి. వరదలు ముంచెత్తాయి. అనేక ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడి 36 మంది చనిపోగా.. అనేక మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొ న్నారు. ఉత్తరత్త సావో పాలో రాష్ట్రం లోని అనేక నగరాల్లో భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. సావో సెబాస్టియాస్టియావో నగరంలో 35 మంది మృతి చెందగా, పొరుగున ఉన్న ఉబాతుబాలో 7 ఏళ్ల చిన్నారి ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. సహాయ బృందాలు ఘటనాస్థలిస్థ కి చేరుకుని సహాయక చర్యల్లో పాల్గొన్నాయని తెలిపారు. సావో సెబాస్టియాస్టి వో, బెర్టియోర్టి గా నగరాల్లో జరగాల్సిన కార్నివాల్ ఉత్సవాలు రద్దుచేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

సావోపాలో రాష్ట్రంలో ఒక్కరోజులోనే 600 మిల్లీ మీటర్ల వర్షం పడినట్లు అధికారులు తెలిపారు. తక్కువ సమయంలోనే అత్యధిక వర్షం పడిన సంఘటనల్లో ఇదొకటని అన్నారు. బెర్టియోర్టిగా ప్రాంతంలో 687 మిల్లీమీల్లీ టర్ల వర్షపాతం నమోదైనట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. రంగంలోకి దిగిన సైన్యం 2 విమానాలతో వరద ప్రభావిత ప్రాంతాలకు చేరుకున్నట్లు వివరించారు.

పోలవరం... పాలకుల నిర్లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

అథారిటీ సిఫారసు చేసినప్పటికీ పోలవరం పూర్తి చేయడానికి నిధులు ఎందుకు ఇవ్వడం లేదని కేంద్రంపై ఒత్తిడి తేవాలని ప్రభుత్వానికి రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. జగన్ అధికారం చేపట్టిన తర్వాత రివర్స్ టెండరింగ్ పేరుతో ప్రాజెక్టుల పట్ల నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. సీఎం జగన్ ఇప్పటి వరకూ ఒక్క సాగునీటి ప్రాజెక్టు పూర్తి చేయలేదన్నారు. కార్పొరేట్ శక్తులకు అనేక రాయితీలు ప్రకటిస్తున్న పాలకులు ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితుల సమస్యలు పరిష్కరించడంలో మీన మేషాలు లెక్కించడం సరికాదన్నారు. త్యాగం చేసిన నిర్వాసితులను గాలికి వదిలేస్తారా అని మోదీ, జగన్‌ను ప్రశ్నించారు. సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించకపోవడంతో నిర్మాణాలు పూర్తికాక వ్యవసాయ రంగం కుదేలై రైతులు అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి కాకపోవడానికి పాలకుల విధానాలే కారణమన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, నిధుల కేటాయింపులు, నిర్వాసితులకు పరిహారం తదితర విషయాలకు సంబంధించి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడానికి సీఎం జగన్ భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రవ్యాప్త పర్యటన పూర్తి అయిన తరువాత విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి కేంద్రమంత్రి షెకావత్‌ను కలుస్తామని రామకృష్ణ అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల న్యాయమైన డిమాండ్ల కోసం అన్ని వర్గాలను కలుపుకొని ఐక్య పోరాటాలు చేస్తామన్నారు. బిజెపి రాష్ట్ర నేతలకు సిగ్గు ఉంటే పోలవరం నిధులపై ఉద్యమించాలని, రూ.2900 కోట్ల నిధులు మంజూరు చేయించాలన్నారు. లేనిపక్షంలో బీజేపీ నాయకులు చరిత్రహీనులుగా మిగులుతారని హెచ్చరించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి ముడిపడి ఉందన్నారు. నిర్వాసితుల సమస్యలపై దిల్లీలోనే తాడోపేడో తేలుస్తామన్నారు. సీపీఐ బృందంలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, రైతు సంఘం జాతీయ అధ్యక్షులు రావుల వెంకయ్య, పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, అక్కినేని వనజ, జి.ఓబులేసు, జి.ఈశ్వరయ్య , డి.జగదీశ్, కేవీవీ ప్రసాద్, డేగా ప్రభాకర్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ కామేశ్వరరావు, కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని, ఎ.విమల, సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు, ఎండీ మునీర్, బి కొండల రావు, జమలయ్య, కుంద్రపు రాంబాబు , వి.కొండలరావు, మండల కార్యదర్శి జేవీ నరసింహారావు, ఏలూరు జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తుల వెంకటేశ్వరరావు, జమ్మి శ్రీనివాసరావు, కారం దారయ్య, బాడిస రాము, మైసాక్షి వెంకటాచారి, ఏలూరు సమితి సభ్యులు జేవీ రమణ రాజు, ఐతా సురేశ్ తదితరులు ఉన్నారు.

ఎన్‌పీఎస్ నిధులు ఇచ్చేది లేదు

(మొదటిపేజీ తరువాయి)

నిబంధనల ప్రకారం ఆ మొత్తాన్ని రాష్ట్రాలకు ఇవ్వడం కుదరదని తేల్చిచెప్పారు. జాతీయ పింఛను విధానాన్ని కాంగ్రెస్ సహా కొన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాజస్థాన్, ఛత్తీసగఢ్, ఝార్ఖండ్ రాష్ట్ర ప్రభుత్వాలు.. పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాయి. పంజాబ్ కూడా ఇదే బాటలో నడిచేందుకు సిద్ధమైంది. అయితే, ఇటీవల అదానీ గ్రూప్ షేర్లు భారీగా పతనం కావడంతో రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్ మాట్లాడుతూ.. ఎన్‌పీఎస్ నిధులను కేంద్రం షేర్ మార్కెట్లలో పెట్టి.. ఉద్యోగులను తమ కర్మకు వదిలేయడం సరికాదని మండిపడ్డారు. ఎన్‌పీఎస్ నిధులు తిరిగివ్వాలని, లేదంటే సుప్రీంకోర్టుకు వెళ్తామని హెచ్చరించారు. కాగా, 2004 జనవరి 1 తర్వాత నియమితులైన ఉద్యోగులకు ఎన్‌పీఎస్ వర్తిస్తుంది. ఈ విధానంలో పింఛను నిధి కింద ప్రతినెలా ఉద్యోగి నుంచి కొంత మొత్తం తీసుకుని, అంతే మొత్తాన్ని ప్రభుత్వం చెల్లిస్తూ నేషనల్ పెన్షన్ ఫండ్‌లో జమ చేస్తుంది. ఉద్యోగి పదవీవిరమణ చేసే నాటికి జమ అయిన మొత్తంలో సగం పదవీవిరమణ సందర్భంగా అందజేస్తారు. మిగతా మొత్తాన్ని వివిధ మార్గాల్లో పెట్టుబడి పెట్టి ఆ మొత్తంపై వచ్చే లాభాలను నెలనెలా పింఛను రూపంలో అందజేస్తారు. అంటే పెట్టుబడులపై లాభాల ఆధారంగా పింఛను మొత్తం ఎంతనేది ఆధారపడి ఉంటుంది. కేంద్రప్రభుత్వ ఉద్యోగులకు ఇటీవల సర్కారు జమ చేసే వాటాను 14 శాతానికి పెంచింది. పాత విధానంలో పింఛను కోసం ఉద్యోగి జీతం నుంచి ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం తీసుకోదు. ఉద్యోగి పదవీవిరమణ చేసే నాటికి ఉన్న మూల వేతనం, డీఏ కలిపిన మొత్తంలో 50శాతం పింఛను రూపంలో ప్రతినెలా అందుతుంది. ఫిట్‌మెంట్‌తో పాటు ద్రవ్యోల్బణం మేరకు డీఏ పెరిగి.. ఆ మేరకు పింఛను కూడా పెరుగుతుంది. ఇలా అందే పింఛను సీపీఎస్ పింఛను కంటే చాలా ఎక్కువగా ఉండటమే కాకుండా తమ పదవీవిరమణ అనంతరం జీవితానికి భరోసా ఉంటుందని ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు. ఉద్యోగి మరణిస్తే ఆయన భార్యకు లేదా దివ్యాంగులైన పెళ్లికాని పిల్లలకు సగం పింఛను అందుతుంది.

ఎంఎస్‌ఎంఈ నూతన పాలసీ

(మొదటిపేజీ తరువాయి)

చదరపు అడుగులతో స్టార్టప్స్ కోసం కొత్త భవనాన్ని నిర్మించాలని సీఎం చెప్పారు. అదే భవనంలో పరిశ్రమలశాఖ కార్యాలయం కూడా ఉండాలన్నారు. పోర్ట్ ఆధారిత పరిశ్రమల కోసం మౌలిక సదుపాయాల కల్పనదిశగా దృష్టిసారించాలన్నారు. ఈ అంశాల ప్రాతిపదికగా ఇండస్ట్రియల్ పాలసీలో ప్రతిపాదనలు తయారు చేయాలని సీఎం ఆదేశించారు. సమావేశంలో పరిశ్రమలశాఖ స్పెషల్ సీఎస్ కరికాల వలవన్, ఆర్థికశాఖ కార్యదర్శులు కేవీవీ సత్యనారాయణ, గుల్జార్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వైసీపీ సామాజిక న్యాయం

ప్రతి గడపకూ చేరాలి

విశాలాంధ్ర బ్యూరో -అమరావతి: వైసీపీ చేస్తున్న సామాజిక న్యాయం ప్రతి గడపకూ చేరాలని, ప్రతి నియోజకవర్గంలో వినిపిం చాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కోరారు. వైయస్సార్సీపీ తరఫున స్థానికసంస్థల కోటా సీట్లకు ఎమ్మెల్సీ అభ్యర్థులు, గవర్నర్ కోటాలో ప్రతిపాదిత వ్యక్తుల ప్రకటన తర్వాత క్యాంపు కార్యాల యంలో వారితో భేటీ అయిన సీఎం గతంలో ఎప్పుడూ జరగని విధంగా సామాజిక న్యాయం చేస్తున్నామని వివరించారు. ఎమ్మెల్సీ పదవులకు 18 మంది పేర్లను ఖరారు చేస్తే... వీరిలో 14 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీలు, మిగిలిన సామాజిక వర్గాల వారికి 4 సీట్లు ఇచ్చామని తెలిపారు. ఆ నాలుగు కూడా ఒక్కో సామాజిక వర్గానికి ఒక్కొక్కటి ఇచ్చామన్నారు. ఒకపక్క

ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన తర్వాత సీఎం జగన్

పారదర్శకంగా లంచాలకు తావులేకుండా మీట నొక్కి నేరుగా లబ్ధిదారులకు పథకాలు అందిస్తున్నామని, మరోపక్క విద్య, వ్యవసాయం, ఆరోగ్య రంగాల్లో మంచి మార్పులు తెచ్చామన్నారు.. ఇవన్నీ ఒక ఎత్తు అయితే.. ఈరోజు మనం చేసిన సామాజిక న్యాయం మరో ఎత్తు అన్నారు. పదవులు తీసుకున్న వారు పార్టీని బలోపేతం చేయాలని, పార్టీ నిర్దేశించిన కార్యక్రమాల్లో క్రియాశీలంగా పాల్గొనాలని కోరారు. వచ్చే 13-14 నెలల్లో ఎన్నికలు రాబోతున్నాయని, ఎమ్మెల్సీలుగా బాధ్య తలు తీసుకుంటున్నవారు పార్టీ కోసం ఏమి చేయగలుగుతామో.. అన్న ఆలోచనతో అడుగులు వేయాలన్నారు. ఈ పదవులు ఆశించిన వారు ఇంకా చాలామంది ఉన్నారని, ఉన్న పదవులు తక్కువ, ఆశావహులు ఎక్కువగా ఉంటారు కాబట్టి.. అందర్నీ సంతృప్తి పరచలేమని, వారికి సర్దిచెప్పాలని నేతలకు సూచించారు. వచ్చే ఎన్నికల్లో 175కి 175 స్థానాలు వై నాట్ అన్నరీతిలో అడుగులు ముందుకు వేసే పరిస్థితుల్లో పరిపాలన కొనసాగుతోందని, అందరూ పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు.

గన్నవరం రణరంగం

(మొదటిపేజీ తరువాయి)

కార్యాలయంపై దాడికి పాల్పడిన వైసీపీ దౌర్జన్యకారులందర్నీ తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ ధర్నాతో చెన్నై-కోల్‌కతా జాతీయరహదారి ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఈలోగా వైసీపీ శ్రేణులు కూడా జాతీయ రహదారిపైకి చేరుకుని పోటాపోటీగా నినాదాలకు దిగారు. ఒకరిపై మరొకరు సవాళ్లు విసురుకోవడంతో వివాదం ముదిరి రెండువర్గాలు బాహాబాహీకి దిగాయి. రాళ్లు, కర్రలతో పరస్పరం దాడులు చేసుకున్నారు. పరిస్థితి కొద్దిసేపు అదుపు తప్పింది. గన్నవరం రణరంగంగా మారింది. ఈ పరిస్థితుల్లో పోలీసులు లాఠీ చార్జి జరిపి రెండువర్గాలను చెదరగొట్టారు. ఫిర్యాదు చేసిన వెంటనే పోలీసులు స్పందించి ఉంటే ఇంత ఘోరం జరిగేది కాదని, దీనంతటికీ పోలీసుల అలసత్వమే కారణమని టీడీపీ నేతలు మండిపడుతున్నారు. పోలీసుల సాక్షిగా వంశీ అనుచరులు విధ్వంసకాండకు దిగారని టీడీపీ నేతలు చెబుతున్నారు. మొదట టీడీపీ ఆఫీస్ దగ్గర ఎమ్మెల్యే వంశీ రెక్కీ నిర్వహించారని చెబుతున్నారు. వంశీపై ఫిర్యాదు చేయడానికి పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన సమయంలో కార్యాలయంపై వంశీ అనుచరులు దాడికి దిగారని చెబుతున్నారు.

గవర్నర్ జోక్యం చేసుకోవాలి: అచ్చెన్నాయుడు

గవర్నర్ వెంటనే జోక్యం చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు. దౌర్జన్య కారకులపై తక్షణం కఠిన చర్యలు తీసుకోవాల న్నారు. ఎమ్మెల్యే వంశీ కనుసన్నల్లోనే టీడీపీ కార్యాలయంపై దాడి జరిగిందని, వైసీపీ రౌడీమూకలు దాడి చేస్తుంటే

పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. టీడీపీ కార్యాలయంపై దాడి రౌడీ పాలనకు పరాకాష్ఠ అని అచ్చెన్నాయుడు విమర్శించారు.

పట్టాభిరామ్ అదృశ్యం

ఈ వార్త తెలియగానే విజయవాడ నుంచి గన్నవరం హుటాహుటిన చేరుకున్న తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరాం అదృశ్యమయ్యారు. ఆయనను పోలీసులు అరెస్ట్ చేశారన్న సమాచారంతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా, అక్కడ ఆయన పీఏ, డ్రైవర్ మాత్రమే ఉన్నారు. పట్టాభిరామ్ లేరు. అక్కడున్న పోలీసులు తమకు సమాచారం తెలియదని చెప్పడం, పట్టాభిరామ్ ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుండడంతో ఆయన సతీమణి తన భర్తకు ఏదైనా జరిగితే సీఎం జగన్, డీజీపీదే బాధ్యత అని హెచ్చరించారు. తక్షణం తన భర్తను అప్పగించాలని డిమాండ్ చేశారు. పట్టాభి కారును కూడా వైసీపీ దౌర్జన్యకారులు ధ్వంసం చేశారు.

టీడీపీ నేతలంతా అరెస్ట్

గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి జరిగిన సమాచారం తెల్సుకుని కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలతోపాటు విజయవాడ నగర టీడీపీ నేతలంతా గన్నవరం బయలుదేరారు. మాజీ మంత్రులు దేవినేని ఉమా, కొల్లు రవీంద్ర, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఏపీలో పోలీస్‌శాఖను మూసేశారా: చంద్రబాబు

గన్నవరం టీడీపీ కార్యాలయంపై వైసీపీ గూండాల దాడిని, వాహనాలను తగలబెట్టిన ఘటనపై చంద్రబాబు మండిపడ్డారు. వైసీపీ ఉన్మాదులు బరితెగించి అరాచకాలు చేస్తుంటే పోలీసులు గాడిదలు కాస్తున్నారా? రాష్ట్రంలో శాంతి భద్రతలు అనేవే లేకుండా చేశారు. పోలీసు శాఖను మూసేశారా? లేక వైసీపీలో విలీనం చేశారా? అంటూ నిప్పులు చెరిగారు. సీఎం ఫ్యాక్షనిస్ట్ మనస్తత్వానికి ఈ ఘటనలే ఉదాహరణ అని, రాష్ట్రాన్ని రావణకాష్ఠంలా మారుస్తున్న జగన్ ఆ మంటల్లో కాలిపోవడం ఖాయమని హెచ్చరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పాయని, గవర్నర్ తక్షణమే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎన్నికలే లక్ష్యంగా...

(మొదటిపేజీ తరువాయి)

ఇద్దరి పేర్లను ప్రకటించారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల్లో అత్యధికంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్దపీట వేశారు. కొత్తగా భర్తీ చేయనున్న స్థానాలు 18 ఉండగా, ఇందులో వైసీపీ తరపున ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ సభ్యుల పరంగా చూస్తే(గవర్నరు కోటాలో ప్రతిపాదిత పేర్లు సహా) 68.18శాతం కేటాయించారు. ఇందులో బీసీ-11, ఎస్సీ-2, ఎస్టీ-1, ఓసీ-4 చొప్పున ఉన్నాయి. గతంలోనే మైనార్టీలకు నాలుగు స్థానాలు కేటాయించినందున, ఈ విడత వారికి చోటు దక్కలేదు. స్థానిక సంస్థల కోటాలో బీసీ-6, ఎస్సీ-1, ఓసీ-2 చొప్పున ఎమ్మెల్సీ సీట్లను కేటాయించారు. ఎమ్మెల్యే కోటాలో బీసీ-4, ఎస్సీ-1, ఓసీ-2, గవర్నరు కోటాలో బీసీ-1, ఎస్టీ-1 చొప్పున అభ్యర్థులను ఖరారు చేశారు. మొత్తంగా చూస్తే 18 స్థానాల్లో 11 సీట్లు బీసీలకు దక్కాయి. వారం రోజుల క్రితం వైసీపీలో చేరిన కైకలూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకట రమణకు ఎమ్మెల్సీ సీటు దక్కింది. బీసీ-వడ్డీల సామాజిక వర్గం కోటాలో ఆయనను పదవి వరించింది. పోతుల సునీతకు మరోసారి పదవి దక్కింది. 2019 ఎన్నికల్లో టీడీపీ గెలుపొందిన స్థానాలకు చెక్ పెట్టే దిశగా వైసీపీ వ్యూహం పన్నింది. అక్కడ ఈ విడత ఎమ్మెల్సీ అభ్యర్థులను కేటాయించింది. విశాఖపట్నంలో ఇప్పటికే ఎమ్మెల్సీగా బీసీకి చెందిన వరుదు కళ్యాణి పనిచేస్తున్నారు. ఈ విడత విశాఖకు బీసీ బలిజకు చెందిన కోలా గురువులు పదవి దక్కించుకున్నారు. ఈ జాబితాలో కాపులకు తూర్పుగోదావరి జిల్లా నుంచి వంక రవీంద్రనాథ్ ఒక్కరికే సీటు లభించింది. గత ఎన్నికల్లో టీడీపీ నుంచి వైసీపీలో చేరిన రామసుబ్బారెడ్డికి ఎమ్మెల్సీ సీటు దక్కింది.

ఎమ్మెల్సీ అభ్యర్థుల వివరాలు...

ఎమ్మెల్యే కోటా:

- పెనుమత్స సూర్యనారాయణ
  విజయనగరం (ఓసీ, క్షత్రియ సామాజికవర్గం)
- పోతుల సునీత
  ప్రకాశం జిల్లా (బీసీ-పద్మశాలి)
- కోలా గురువులు
  విశాఖ జిల్లా (బీసీ బలిజ)
- బొమ్మి ఇజ్రాయిల్
  డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా(ఎస్సీ-మాదిగ)
- జయమంగళ వెంకట రమణ
  ప.గో.జిల్లా (బీసీ-వడ్డీలు)
- చంద్రగిరి ఏసురత్నం
  గుంటూరుజిల్లా (బీసీ-వడ్డెర)
- మర్రి రాజశేఖర్
  పల్నాడు జిల్లా (ఓసీ-కమ్మ)

స్థానిక సంస్థల కోటా:

- నర్తు రామారావు
  శ్రీకాకుళంజిల్లా (బీసీ-యాదవ)
- కదుపూడి సూర్యనారాయణ
  తూర్పు గోదావరిజిల్లా (బీసీ-సెట్టి బలిజ)
- వంక రవీంద్రనాథ్
  పశ్చిమ గోదావరిజిల్లా (ఓసీ-కాపు)
- కవురు శ్రీనివాస్
  పశ్చిమ గోదావరి జిల్లా (బీసీ-సెట్టి బలిజ)
- మేరుగు మురళీధర్
  నెల్లూరుజిల్లా(ఎస్సీ-మాల)
- సిపాయి సుబ్రహ్మణ్యం
  చిత్తూరు (బీసీ-వన్నె రెడ్డి)
- పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి
  వైఎస్ఆర్ కడప (ఓసీ-రెడ్డి)
- ఎ.మధుసూదన్
  కర్నూలు (బీసీ-వాల్మీకి బోయ)
- ఎస్.మంగమ్మ
  అనంతపురం(బీసీ-వాల్మీకి బోయ)

గవర్నరు కోటా:

- కుంభా రవి-
  అల్లూరి జిల్లా (ఎస్టీ-ఎరుకల)
- కర్రి పద్మశ్రీ
  కాకినాడ (బీసీ-వడ బలిజ(మత్స్యకార).

సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్నాం: సజ్జల



సామాజిక న్యాయానికి వైసీపీ కట్టుబడి ఉందని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. టీడీపీ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 37శాతం ప్రాతినిధ్యం కల్పిస్తే, వైసీపీ మాత్రం 68.18 శాతం ఎమ్మెల్సీ పదవులు కేటాయించిందన్నారు. ఇందులో ఒక్క బీసీలకే 43శాతం ఇస్తూ పెద్దపీట వేసిందని వివరించారు. సామాజిక సాధికారత అంటే తమ ప్రభుత్వానిదేనని, చంద్రబాబు మాటల్లో చెబితే...తాము చేతల్లో చూపించామన్నారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 62.5 శాతం ఓసీలు, 32 శాతం బీసీలు ఉన్నారని తెలిపారు. 87 మున్సిపాల్టీల్లో 84 చోట్ల వైసీపీ గెలుపొందగా, అందులో 44 మంది మున్సిపల్ చైర్మన్లను బీసీలనే నియమించామన్నారు.

ప్రజాభిప్రాయసేకరణ

(మొదటిపేజీ తరువాయి)

తెలియజేశారు. దీనిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అజయ్ రస్తోగి, జస్టిస్ బేలా ఎం త్రివేదితో కూడిన ద్విసభ్య ధర్మాసనం స్పందిస్తూ కాలుష్య నియంత్రణ మండలి జారీ చేసిన షోకాజ్ నోటీసులపై న్యాయ పరిష్కారాల కోసం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని, ఆ తర్వాత జారీ చేసే ఉత్తర్వులను నాలుగు వారాలపాటు నిలుపుదల చేయాలని ఆదేశించింది.

చట్టం వారికి చుట్టం!

(మొదటిపేజీ తరువాయి)

ప్రదర్శించి తమ ప్రేమను చాటుకున్నారు. నివాస ప్రాంతంలో కమర్షియల్ భవనానికి అనుమతులు లేకపోయినా 16 వార్డు ఇసుక తోటలో మేయర్ భర్త గొలగాని శ్రీనివాసరావు పేరిట 240 గజాల స్థలంలో నాలుగు అంతస్తుల భవనం (వసుదేవ్ కల్యాణ మండపం) ఇటీవల నిర్మించారు. అయితే రూ. 67 వేలు ఈ భవనానికి కమర్షియల్ ఇంటి పన్ను వేయాల్సి ఉన్నప్పటికీ కేవలం రూ.1130 ఇంటి పన్ను వేసి జీవీఎంసీ రెవెన్యూ అధికారులు తమ భక్తిని చాటుకున్నారు. ఇదే వార్డులో కమర్షియల్ భవనాలకు అనుమతి లేదని నిర్మించిన అపూర్వ కల్యాణ మండపాన్ని అధికారులు సీజ్ చేశారు. మేయర్ భర్త... ఇంటి నిర్మాణం కోసం ప్లాన్ తీసుకొని, ఆపై అనధికార అంతస్తు నిర్మించుకొని, జీవీఎంసీకి రావాల్సిన ఆదాయానికి గండి కొట్టారని, వెంటనే చర్యలు తీసుకోవాలని జనసేన 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ సోమవారం స్పందన లో జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ భవన నిర్మాణానికి అనేకమంది అధికారులు, బిల్డర్ల ద్వారా బెదిరించి భవన నిర్మాణ సామాగ్రిని కూడా దండుకున్నారని, చివరికి అగ్నిమాపక శాఖ అధికారుల నుంచి కల్యాణ మండపానికి ఫైర్ సేఫ్టీ పరికరాలను ఉచితంగా సమకూర్చుకున్నారని మూర్తి యాదవ్ ఆరోపించారు. ఇక 22 వార్డులో ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ ఓ భవనం నిర్మించారని, ఆ భవనానికి 1లక్ష 40 వేలు భవన నిర్మాణ అనుమతుల ఫీజులు కట్టాల్సి ఉన్నప్పటికీ కేవలం 10 వేలు మాత్రమే కట్టి చేతులు దులుపుకున్నారని కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దాదాపు రూ.4 కోట్లు వెచ్చించి నూతనంగా నిర్మించుకున్న కమిషనర్ భవనానికి పక్కనే ఉన్న సీబీసీఎన్ సీ 18, 380 గజాల స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా పనులు సాగుతుంటే కనీసం పట్టించుకోకపోవడం చర్చనీయాంశమైంది. సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన 3600 గజాలు స్థలాన్ని కూడా ఆక్రమించుకొని నిర్మాణాలు సాగిస్తున్నారని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. క్రైస్తవ సంఘాలను బెదిరించి , ఆ స్థలాన్ని తమ గుప్పిట్లోకి తెచ్చుకున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, మాజీ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ చైర్మన్ జీ వెంకటేశ్వరరావు దొడ్డి దారిలో రూ. 63 కోట్లు విలువ చేసే టీడీఆర్‌లు పొందారని కూడా కమిషనర్‌కు కార్పొరేటర్ మూర్తి యాదవ్ ఫిర్యాదు చేయడం తీవ్ర దుమారాన్ని రేపింది. 20 వార్డు లో వైసీపీ నేత సెల్లార్ లో రెండు ఫ్లాట్లు నిర్మించి రూ.40 లక్షలు చొప్పున అమ్ముకున్నప్పటికీ జీవీఎంసీ ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టకపోవడంపై వార్డు కార్పొరేటర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడం చూస్తుంటే ఇలా అధికార పార్టీకి అడుగడుగునా అధికారులు అండదండగా నిలుస్తున్నారని తేటతెల్లమవుతోంది. జీవో 119 ప్రకారం, హైకోర్టు ఆదేశాల ప్రకారం పార్కింగ్ సెల్లార్ లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదు. అయినప్పటికీ అధికార పార్టీ నేతలకు కోర్టు ఆదేశాలు, జీవోలు, నిబంధనలు వర్తించవా అంటూ సామాన్య ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. అదే పేదవాడు 60 గజాల్లో చిన్నపాటి ఇల్లు నిర్మించుకుంటే సవాలక్ష నిబంధనల పేరిట ముప్పతిప్పలు పెట్టే మున్సిపల్ అధికారులు అధికార వైసీపీ నేతలకు వత్తాసు పలకడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చట్టాలను అమలు చేయవలసిన ప్రజాప్రతినిధులే ఇలా చట్టాలను తమకు చుట్టాలుగా మార్చుకొని స్వప్రయోజనాలు నెరవేర్చుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. విశాఖ నగర మేయర్ భర్త నిర్మించిన కల్యాణ మండపానికి పన్ను విధింపులో అక్రమాలు జరిగాయని, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అనుచరగణం అనుమతులు లేకుండా సీబీసీఎన్‌సీలో పనులు చేపట్టారని, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ భవన నిర్మాణానికి ఫీజులు చెల్లించలేదని, 22 వార్డులో వైసీపీ నేత పీతల గోవింద్ బిల్డర్ అవతారం ఎత్తి... గతంలో కూల్చివేసిన సెల్లార్లో ఫ్లాట్లను పునర్నిర్మాణం చేపట్టి అమ్ముకోడానికి జీవీఎంసీ అధికారులు సహకరించారని ఆరోపిస్తూ సోమవారం జీవీఎంసీ కమిషనర్‌కు స్పందనలో జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ ఫిర్యాదు చేశారు.

ఉమ్మడి ఆప్షన్‌కు ఓకే

(మొదటిపేజీ తరువాయి)

అంగీకరించలేదు. దీంతో అప్పుడు ఆప్షన్ ఇవ్వని వారికి మరో అవకాశం కల్పిస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వులిచ్చింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఆప్షన్‌కు అవకాశం ఇస్తూ ఈపీఎఫ్‌ఓ ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం.. ఉమ్మడి ఆప్షన్‌కు సంబంధించి ప్రత్యేక యూఆర్‌ఎల్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని ఈపీఎఫ్‌ఓ పేర్కొంది. ఈపీఎఫ్‌ఓ వెబ్‌సైట్‌లో దీనికి సంబంధించిన లింక్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యూఆర్‌ఎల్ ద్వారా సభ్యులు డిజిటల్‌గా లాగిన్ అయ్యి రిజిస్టర్ చేసుకోవచ్చు. ఇలా లాగిన్ అయిన వారు దరఖాస్తుదారుల రశీదు నంబర్‌ను కేటాయిస్తారు. పీఎఫ్ ప్రాంతీయ కార్యాలయం ఆఫీసు ఇన్‌చార్జులు ఉమ్మడి ఆప్షన్ దరఖాస్తులు పరిశీలిస్తారు. ఇన్‌చార్జుల నిర్ణయాన్ని ఈ-మెయిల్/పోస్ట్, ఎస్సెమ్మెస్ ద్వారా సభ్యులకు సమాచారం తెలియజేస్తారు. ఉమ్మడి ఆప్షన్‌కు సంబంధించి దరఖాస్తు, పేమెంట్ బకాయిలు వంటి ఏవైనా ఫిర్యాదులు ఉంటే గ్రీవెన్స్ పోర్టల్ అయిన ఈపీఎఫ్ఐజీఎంఎస్‌లో ఫిర్యాదు చేయొచ్చని ఈపీఎఫ్‌ఓ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. 2022 నవంబర్ 4న సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు ఆధారంగా ఈ ఆదేశాలు జారీ చేసినట్లు ఈపీఎఫ్‌ఓ తెలిపింది.

హోదా సాధన కోసం

కేంద్రంపై ఒత్తిడి తేవాలి

- అఖిల పక్షాన్ని ఢిల్లీ తీసుకెళ్లండి
- రాజకీయ పార్టీలు, విద్యార్థి, యువజన సంఘాల డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధన కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని, అఖిల పక్షాన్ని ఢిల్లీ తీసుకువెళ్లాలని రాజకీయ పార్టీలు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. విభజన చట్టంలోని అన్ని అంశాలను అమలు చేయటంతో పాటు రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని రాజ్యసభలో హామీ ఇచ్చి 9 సంవత్సరాలు పూర్తవుతున్నా వాటిని అమలు చేయకుండా మోదీ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను, యువతను మోసం చేసిందని విమర్శించారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావటంలో పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. హోదా సాధన కోసం రానున్న రోజుల్లో మరో తీవ్రస్థాయి ఉద్యమాన్ని చూడాల్సి ఉంటుందని నాయకులు హెచ్చరించారు.

విభజన చట్టంలో పొందుపరిచిన అంశాలు ఆమోదం పొంది 9 సంవత్సరాలయిన సందర్భంగా సోమవారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హోదా సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ గత నెల 20 నుంచి ఈనెల 4 వరకు అన్ని విద్యార్థి, యువజన సంఘాలు చేపట్టిన 'సమర యాత్ర'లో పెద్దఎత్తున యువత, ప్రజలు పాల్గొని విజయవంతం చేశారని, ప్రజా సంఘాలు కూడా మద్దతు పలికాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్ర ప్రదేశ్‌ను నాశనం చేస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం ఏమి చేస్తోందని ప్రశ్నించారు. విపక్షాలను వేధించే బదులు ఢిల్లీలోని మోదీని నిలదీయాలన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం అమ్మేస్తూ, కడపలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయకుండా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారన్నారు. విభజన హామీల అమలుపై శ్వేత పత్రం విడుదల చేయకుండా బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారని విమర్శించారు. అన్ని వర్గాల ప్రజల్లో ఆగ్రహావేశాలు పెరుగుతున్నాయని, నిరుద్యోగ యువత ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. కేంద్రంలో బీజేపీకి బుద్ధి చెప్పే రోజు దగ్గరలోనే ఉందన్నారు. ప్రతి రాష్ట్రానికి వెళ్లి బీజేపీ చేసిన దుర్మార్గాన్ని ప్రచారం చేసి, వంద లోక్‌సభ సీట్లపై ప్రభావం చూపేలా చేస్తామని ఆయన హెచ్చరించారు. వచ్చే నెలలోపు రాష్ట్ర ప్రభుత్వం విభజన హామీల అమలు, హోదా సాధనపై స్పష్టమైన వైఖరి చెప్పాలని డిమాండ్ చేశారు. అవసరమైతే చలో అసెంబ్లీ సైతం చేపట్టడానికి వెనుకాడమని అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ వైసీపీ కార్యకర్తలా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం రాజకీయాలు మాని, విభజన హామీలను అమలు చేసేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని అన్నారు. లేకపోతే అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని ఐక్య ఉద్యమం చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కేంద్ర ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ ఉండటం ఏపీ ప్రజల దురదృష్టం అన్నారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విభజన చట్టంలోని ఏపీకి ప్రత్యేక హోదాను నిర్ణీత గడువులో అమలు చేస్తామని చెప్పి 9 ఏళ్లు గడిచినా హామీలు అమలు చేయలేదన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయమని చెప్పడం శోచనీయం అన్నారు. 14వ ఆర్థిక సంఘం పార్లమెంటు కంటే గొప్పదా అని ప్రశ్నించారు. ముగిసిన అధ్యాయం అయితే బీహార్‌కి ప్రత్యేక హోదా ఇస్తామని మోదీ ఎలా చెబుతారని ఆయన ప్రశ్నించారు. పరిశ్రమలు పెడితే ఉపాధి అవకాశాలు పెరిగి నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు వస్తాయన్నారు. విభజన హామీలు అమలు చేయకపోయినా రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నించడం లేదని, మోదీ, జగన్ రాష్ట్ర హామీల విషయంలో క్విడ్ ప్రోకోకి పాల్పడుతున్నారన్నారు. విద్యార్థి, యువజన సంఘాల బస్సు యాత్రకు ఆటంకాలు సృష్టించారని, ఆఖరుకు విద్యార్థులను బెదిరించారని, కేసులు పెడతామన్నారని, అయినా వారు ముందుకు సాగారని కొనియాడారు. హోదా, విభజన హామీల అమలు కోసం అన్ని పార్టీలతో కలిసి ఐక్య ఉద్యమం చేపడతామని తెలిపారు.

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకర్ మాట్లాడుతూ పార్లమెంటు చట్టం కల్పించిన వసతులన్నీ అనుభవిస్తున్న ఎంపీలు విభజన హామీలపై మాట్లాడటం లేదని ఎద్దేవా చేశారు. నేటికీ ప్రజా సంఘాలు విభజన హామీలను అమలు చేయాలని ఉద్యమం చేస్తున్నాయని తెలిపారు. నిరుద్యోగం పోవాలన్నా, పరిశ్రమలు రావాలన్న ప్రత్యేక హోదా రావాలని అన్నారు. విద్యార్థి యువజన సంఘాలు హోదా, విభజన హామీల అమలు కోసం బస్సు యాత్ర చేపడితే, ప్రభుత్వం అడుగడుగునా అవరోధాలు సృష్టించిందని, కోర్టు నుంచి అనుమతి తీసుకోవలసి వచ్చిందని అన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్రబాబు మాట్లాడుతూ విభజన హామీలు, ప్రత్యేక హోదాపై పాలకులు తమ ధోరణిని మార్చుకోవాలని, లేకుంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. హోదా సాధించాలంటే తనకు 25 మంది ఎంపీలు ఇవ్వాలని చెప్పి అధికారంలో వచ్చాక మాట తప్పారని, సీఎం తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీల అమలు సాధన కోసం అవసరమైతే అమరణ నిరాహార దీక్షలు చేయటానికి కూడా వెనుకాడేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ విజయవాడ నగర అధ్యక్షులు నరహరశెట్టి నరసింహారావు, సీపీఎం నాయకులు సీహెచ్.బాబురావు, దోనేపూడి కాశీనాథ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయికుమార్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్య క్షులు ఎస్‌కె.సుభాని, రాష్ట్ర నాయకులు లంకా గోవింద రాజులు, జంగాల చైతన్య, లంకె సాయి, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్, రాష్ట్ర నాయకులు రాజేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రసన్నకుమార్, అశోక్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి వేముల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి: ఏఐవైఎఫ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, ప్రస్తుత ఖాళీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్రబాబు డిమాండ్ చేశారు. విజయవాడ హనుమాన్‌పేటలోని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. రాజేంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 2.35 లక్షల పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదన్నారు. ఎన్నికల సమయంలో సీఎం జగన్... అధికారంలోకి రాగానే ప్రభుత్వ శాఖల్లో నోటిఫికేషన్ విడుదల చేస్తానంటూ నిరుద్యోగులకు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రతి ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ హామీతో అధికారంలోకి వచ్చి, నిరుద్యోగ యువతను మోసగించారన్నారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చెందిన డీఎస్సీ విషయంలోనూ నిరుద్యోగులను ప్రభుత్వం దగా చేసిందని, ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 50,667 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ ప్రకటన ఇవ్వకుండా ఎస్‌జీటీలతో అదనపు తరగతులు నిర్వహిస్తూ, డీఎస్సీ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, ప్రధానంగా విద్య, వైద్య, ఆర్థిక శాఖలో ఖాళీ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ సుభాని, రాష్ట్ర నాయకులు జంగాల చైతన్య, ఎన్టీఆర్ జిల్లా నాయకుడు లంక గోవిందరాజులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎం.సాయి కుమార్, లంకె సాయి, కరేటి రవీంద్ర, నాని పాల్గొన్నారు.

మోదీతోనే అదానీ కుబేరుడు

సదస్సులో వక్తల విమర్శ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రధాని నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి భారత ఆర్థిక వ్యవస్థను అదానీ హైజాక్ చేశారని వక్తలు విమర్శించారు. దేశంలోని సహజ వనరులను అదానీకి మోదీ దోచి పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ అధ్వర్యంలో 'అదానీ కుంభకోణం-ప్రజల సంపదకు ముప్పు' అంశంపై సోమవారం విజయవాడ బాలోత్సవ భవనంలో పార్టీ రాష్ట్రకార్యదర్శి వి.శ్రీనివాసరావు అధ్యక్షతన సదస్సు జరిగింది. శ్రీనివాసరావు మాట్లాడుతూ అదానీ ఆస్తులు తక్కువ కాలంలో అసాధారణంగా ఎలా పెరిగాయని ప్రశ్నించారు. దేశంలో డొల్ల కంపెనీల ద్వారా పైకి వస్తున్నారని, అంతర్జాతీయంగా దేశ ప్రతిష్ఠ దెబ్బతిందన్నారు. హిడెన్ బర్గ్ నివేదికపై అదానీ జాతీయవాదం పేరుతో రెచ్చగొడుతున్నారని విమర్శించారు. అదానీ కుంభకోణాన్ని మోదీ ప్రభుత్వం వెనకేసుకొస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదానీ తప్పుడు పనులకు కేంద్రప్రభుత్వం కొమ్ము కొస్తున్నదన్నారు. దేశ ప్రతిష్ఠను మంటగలిపి, ఆర్థిక వ్యవస్థను నాశనం చేశారని, ప్రభుత్వ రంగ సంస్థలను దెబ్బకొట్టారని, మధ్యతరగతి మదుపు దారుల షేర్లను నష్టపరి చారని తెలిపారు. రాష్ట్రా న్ని కూడా తన గుప్పెట్లోకి తీసుకు నేందుకు అదానీ ప్రయత్ని స్తున్నారని విమ ర్శించారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రపంచ కార్పొరేట్ చరిత్రలో అదానీది అతిపెద్ద కుంభకోణమని తెలిపారు. షేర్ మార్కెట్లో రూ.5.లక్షల కోట్లు అవిరైనట్లు చెప్పారు. మోదీ సహకారంతోనే అదానీ ప్రపంచ కుబేరుడుగా అవతరించారన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ అదానీకి పరిశ్రమలు అప్పగించాలంటూ పారిశ్రామికవేత్తలపై మోదీ ఒత్తిడి తెస్తున్నారన్నారు. ప్రజలను చైతన్యపరచి మోదీ, అదానీ ఆర్థిక విధానాలను వివరించాలని సూచించారు.

అది టీడీపీ డైవర్షన్ పాలిటిక్స్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలో అత్యధిక శాతం ఎమ్మెల్సీ సీట్లను బీసీలకు సీఎం వైఎస్ జగన్ కేటాయించి, మరోసారి బీసీ పక్షపాతిగా నిలిచారని వైసీపీ బీసీ నేత డాక్టర్ అంబటి నాగ రాధాకృష్ణ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో కొనియాడారు. అయితే దీనిని పక్కదారి పట్టించేందుకు టీడీపీ డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడిందని తెలిపారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి వెళ్లకుండా ఉండేందుకుగాను టీడీపీ నేతలు గన్నవరంలో అరాచకానికి తెరదీసి పక్కదారి పట్టించేందుకు ప్రయత్నించారన్నారు. చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్‌లో సిద్ధహస్తుడని విమర్శించారు. బీసీలకు అత్యధిక సీట్లు కేటాయించిన సీఎం జగన్‌కు నాగరాధాకృష్ణ ధన్యవాదాలు తెలిపారు.

మాతృభాషకు ప్రాధాన్యతివ్వాలి

శ్రీనివాసరావు డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రపంచవ్యాప్తంగా ఈనెల 21వ తేదీన మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలో మాతృభాషకు ప్రాధాన్యత ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి సోమవారం ఆయన ఈ మేరకు లేఖ రాశారు. 'బహు భాషా విద్య' నినాదంతో యునెస్కో మాతృభాషా దినోత్సవాలు నిర్వహిస్తోందని, దీన్ని రాష్ట్రంలోనూ ఘనంగా జరపాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని సూచించారు. అంతర్జాతీయ భాషా దినోత్సవం నిర్వహించడానికి ఇంతవరకు ప్రభుత్వం ప్రకటన చేయకపోవడంపై ఆయన విచారం వ్యక్తం చేశారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తెలుగును చాలా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. విద్యలో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టి తెలుగును పూర్తిగా దూరం చేశారని విమర్శించారు. తెలుగు రాయలేని స్థితి, ఇంగ్లీషు మాట్లాడలేని దుస్థితి పిల్లలకు వస్తోందని, ఆధునిక శాస్త్ర సాంకేతికతను అర్థం చేసుకొని మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా ఉన్నతశ్రేణి మేధావులుగా, శాస్త్రవేత్తలుగా మారటానికి ఇది ఏ మాత్రం అనువుగా లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో తెలుగు, ఉర్దూతోపాటు చాలా ఆదిమ భాషలు ఉన్నాయని వివరించారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని వారి భాషల్లో చదువు నేర్పటానికి భాషా వలంటీర్లను నియమించగా, ఇప్పుడు వారిని తొలగించడం తగదన్నారు. భాషా వలంటీర్లు ఇప్పుడు గాలిలో ఉన్నారని, వారి పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని విమర్శించారు.

పార్వతీపురం విశాలాంధ్ర విలేకరి మృతి

విశాలాంధ్ర-పార్వతీపురం/ గరుగుబిల్లి : మన్యం జిల్లాలోని పార్వతీ పురం మండలం విశాలాంధ్ర విలేకరి జన్నేటి శ్రీనివాసరావు (45) సోమవారం ఉదయం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మరణించారు. గత పదేళ్లుగా ఆయన విశాలాంధ్రలో ఉంటూ విశేష సేవలు అందించారు. ఆయన మృతికి మన్యం జిల్లా, విజయనగరం జిల్లాలోని సీపీఐ, సీపీఎం, వైసీపీ, టీడీపీ నాయకులు, విలేకరులు, ప్రజా సంఘాల నాయకులు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన మృతదేహానికి నివాళులు అర్పించిన వారిలో ఎమ్మెల్యే జోగారావు, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాగ్దేవి, మాజీ ఎమ్మెల్సీ జగదీష్, మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, విశాలాంధ్ర బ్రాంచ్ మేనేజర్ రామకృష్ణ, ఎస్సీ, ఎస్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం, ఎస్టీ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి రంజిత్ కుమార్ ఉన్నారు.



ఇద్దరు పోలీసులను హత్య చేసిన మావోయిస్టులు

విశాలాంధ్ర-చింతూరు (అల్లూరి జిల్లా) : మావోయిస్టులు ఇద్దరు పోలీసులను హత్య చేసిన ఘటన చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగింది. సోమవారం ఉదయం సుమారు 8.15 నిమిషాలకు చత్తీస్‌గఢ్-మహారాష్ట్ర సరిహద్దుల్లోని రాజనందగాం జిల్లా బోర్దలాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సమీప అటవీ ప్రాంతంలో సుమారు 11 మంది పురుషులు, నలుగురు మహిళా మావోయిస్టుల బృందం మోటార్ సైకిల్‌పై వెళుతున్న హెడ్ కానిస్టేబుల్ రాకేష్ సింగ్, కానిస్టేబుల్ లలిత్ యాదవ్‌ను హత్య చేశారు. అనం తరం వారి మోటార్ సైకిల్‌ను దగ్ధం చేశారు. ఈ సంఘటనకు తామే బాధ్య లుగా ఎల్‌వోఎస్ మావోయిస్టు కమాండర్లు దేవచంద్, రానో ప్రకటించారు.

21 రోజుల్లోనే పరిశ్రమలకు అనుమతులు

వెల్లడించిన మంత్రులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి/ముంబై: రాష్ట్రంలో నూతన పారిశ్రామిక విధానాన్ని అమల్లోకి తీసుకొస్తున్నట్లు మంత్రులు బుగ్గన, జి.అమర్నాథ్, ఆదిమూలపు సురేశ్ పేర్కొన్నారు. విశాఖలో మార్చి 3, 4 తేదీల్లో జరగనున్న గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌పై ముంబైలో పరిశ్రమల శాఖ రోడ్ షో నిర్వహించింది. పరిశ్రమల శాఖ అధికారులతో పాటు మంత్రులు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. పరిశ్రమల ఏర్పాటుకు భూ లభ్యత, వనరులు, 21 రోజుల్లోనే అనుమతులు తదితర అంశాలను ముంబైలోని పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారులకు పరిశ్రమల శాఖ అధికారులు వివరించారు. కాస్మోపాలిటన్ నగరంగా విశాఖలో పెట్టుబడులకు విస్తృత అవకాశాలు ఉన్నట్టుగా తెలిపారు. ఐటీ తరహాలో ఆహార శుద్ధి పరిశ్రమల్లోనూ ప్లగ్ అండ్ ప్లే విధానాన్ని అమలు చేయాలని ఏపీ నిర్ణయించినట్లు ఆహార శుద్ధి పరిశ్రమల సొసైటీ సీఈఓ భరత్ తెలిపారు. కొత్తగా 26 పరిశ్రమలకు ఈ తరహా విధానం అమలు చేయనున్నట్టు వెల్లడించారు. 15 ఏళ్లకు లీజు విధానంలో పరిశ్రమలు ఇవ్వనున్నట్టు స్పష్టం చేశారు. ఆహార శుద్ధి పరిశ్రమల్లో రూ.3600 కోట్ల పెట్టుబడులు ప్రభుత్వమే సమకూరుస్తుందని వివరించారు. ఏపీ ప్రభుత్వం పోర్టు ఆధారిత అభివృద్ధిపై ప్రధానంగా దృష్టి సారించిందని ఏపీ మారిటైమ్ బోర్డు సీఈఓ రవీందర్‌రెడ్డి తెలిపారు. అంతర్జాతీయంగా పోర్టులు ఇప్పుడు పారిశ్రామిక కాంప్లెక్సులుగా మారిపోతున్నాయని, ఇదే ఆలోచనతో ఏపీ ప్రభుత్వం పోర్టుల వద్ద 5-10 వేల ఎకరాల భూములను పరిశ్రమల కోసం కేటాయించనున్నట్లు వివరించారు. ఓడరేవులకు అనుసంధానంగా ఏపీఐఐసీ ద్వారా భూమిని పరిశ్రమలకు కేటాయిస్తున్నామన్నారు. ఏపీలో ప్రస్తుతమున్న ప్రభుత్వ-ప్రైవేట్ రంగ పోర్టులన్నీ డీప్ వాటర్ పోర్టులేనని స్పష్టంచేశారు. మరో మూడు కొత్త పోర్టులు ప్రభుత్వ రంగంలో, మరొకటి ప్రైవేటు రంగంలో నిర్మాణం అవుతున్నాయని తెలిపారు. ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ... ఒకేచోట పరిశ్రమల్ని గుమ్మరించారని వ్యాఖ్యానించారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీ పారిశ్రామికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. అందుకే ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లో పోర్టులు, రహదారులు, రైల్ నెట్‌వర్క్‌లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. బెంగళూరు, హైదరాబాద్, చెన్నై లాంటి నగరాల చుట్టుపక్కలే ఏపీలోని నగరాలున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. వాటికి ఆనుకునే పరిశ్రమలకు కేటాయించేలా భూములు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. ఏపీలో సుస్థిర ప్రభుత్వం ఉందని, పెట్టుబడులకు అనుకూలమని మంత్రి పెట్టుబడి దారులకు వివరించారు. మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ మాట్లాడుతూ ఏపీలోని అపారమైన వనరుల్ని అందిపుచ్చుకునే దిశగా ముందడుగు వేయాలని మహారాష్ట్రలోని పెట్టుబడిదారులకు విజ్ఞప్తి చేశారు. పాలన వికేంద్రీకరణ కోసం గ్రామవార్డు సచివాలయాల పేరిట పౌరులకు విస్తృత సేవలందిస్తున్నామన్నారు. ఏపీలో వైసీపీ ప్రభుత్వం నాలుగేళ్లుగా అభివృద్ధికి, సంక్షేమానికి సమానంగా నిధులు కేటాయిస్తోందని వెల్లడించారు. పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా 11 పారిశ్రామిక కారిడార్లు ఉంటే అందులో ఏపీలోనే 3 ఉన్నాయని, పరిశ్రమలకు ఎంత అనుకూలమో ఇది స్పష్టం చేస్తుందని తెలిపారు. పరిశ్రమల అవసరాల కోసం 48 వేల ఎకరాల భూమి అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. ప్రస్తుతం 530 పారిశ్రామిక ఎస్టేట్లు, 293 పారిశ్రామిక పార్కులు, మూడు ఐటీ సెజ్‌లు, ఆరు స్పెషల్ ఎకనామిక్ జోన్లు ఏపీలో ఉన్నాయని, లక్ష ఎకరాల్లో పరిశ్రమలు పని చేస్తున్నాయని తెలిపారు. ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటులో కీలక వనరులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఏపీ భవిష్యత్ రాజధాని విశాఖకు రావాల్సిందిగా మహారాష్ట్రలోని పెట్టుబడిదారులను ఆహ్వానిస్తున్నానన్నారు.

మల్లన్న సేవలో గవర్నర్ విశ్వభూషణ్

విశాలాంధ్ర-శ్రీశైలం: రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ కుటుంబ సమేతంగా సోమవారం ఉదయం ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీశైలంలోని శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు ఆచరించారు. తొలుత గవర్నర్ కుటుంబం సున్నిపెంట హెలిప్యాడ్‌కు చేరుకోగా జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్, ఎస్పీ రఘువీర్ రెడ్డి తదితరులు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి శ్రీశైలంలోని భ్రమరాంబ అతిథిగృహానికి చేరుకున్నారు. గంగాధర మండపం వద్ద రాష్ట్ర గవర్నర్ సతీమణి సుప్రభ హరిచందన్, కుమారుడు ప్రశంజిత్ హరిచందన్, కోడలు సరోజిని హరిచందన్‌కు ధర్మకర్తల మండలి అధ్యక్షుడు రెడ్డి వారి చక్రపాణి రెడ్డి, దేవస్థానం ఈఓ లవన్న, దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకస్వాములు, వేదపండితులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో గవర్నర్ దంపతులచే అర్చక స్వాములు ప్రత్యేక పూజలు చేయించారు. వేద పండితులు ఆశీర్వచనం అనంతరం గవర్నర్ దంపతులు తీర్థప్రసాదాలను స్వీకరించారు.

కొత్త గవర్నర్ ప్రమాణస్వీకార ఏర్పాట్లపై సమీక్ష

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక): రాష్ట్ర నూతన గవర్నర్‌గా నియమితులైన జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ఈనెల 24వ తేదీన ప్రమాణస్వీకారం చేయనున్న దృష్ట్యా అన్ని ముందస్తు ఏర్పాట్లను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి రేవు ముత్యాలరాజు అధికారులకు సూచించారు. నూతన గవర్నర్‌కు స్వాగతం, ప్రమాణస్వీకారం, ప్రస్తుత గవర్నర్‌కు వీడ్కోలు తదితర కార్యక్రమాల ఏర్పాట్లపై సోమవారం ఆయన కలెక్టర్లు ఎస్.ఢిల్లీరావు, రంజిత్‌బాషా, కృష్ణాజిల్లా ఎస్పీ జాషువా, సబ్ కలెక్టర్ అదితిసింగ్, ప్రోటోకాల్ డైరెక్టర్ బాలసుబ్రమణ్యారెడ్డితో స్థానిక కలెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నూతన గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ఈనెల 22వ తేదీ బుధవారం ఉదయం గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు ప్రోటోకాల్ ఏర్పాట్లును కృష్ణాజిల్లా కలెక్టర్ పర్యవేక్షించాలన్నారు. నూతన గవర్నర్ రాజభవన్ చేరుకుంటారని అయినప్పటికీ హోటల్ నోవాటెల్‌లో కూడా విడిది ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. 24వ తేదీ ఉదయం రాజ్‌భవన్‌లో నూతన గవర్నర్‌చే రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణ స్వీకారం చేయిస్తారని, అనంతరం అతిధులకు గవర్నర్ తేనీటి విందు కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రమాణ స్వీకారానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు, ఇతర ప్రజాప్రతిధులు, ఉన్నతాధికారులు, అనేకమంది న్యాయమూర్తులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఆహ్వానితులకు ముందుగానే ఆహ్వాన పత్రికలు అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. 21వ తేదీన నగరంలోని ఎ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రస్తుత గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌కు రాష్ట్ర ప్రభుత్వం తరపున నిర్వహించనున్న వీడ్కోల సభకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

ఏయూ వీసీపై టీడీపీ ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో జరగనున్న గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాలో అవకతవకలపై సోమవారం తెలుగుదేశం పార్టీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. వెలగపూడి సచివాలయంలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు,ఎమ్మెల్సీ అశోక్ బాబు, బుచ్చి రామ్ ప్రసాద్ తదితరులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్‌కుమార్ మీనాను కలిసి ఆంధ్రా యూనివర్శిటీ వీసీ ప్రసాదరెడ్డిపై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. మహామహులు చదివిన యూనివర్సిటీ, సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి వారు వైస్ ఛాన్సలర్ గా పని చేసిన విశ్వవిద్యాలయాన్ని ఇప్పుడు ప్రసాద్ రెడ్డి వైసీపీ కార్యాలయంగా మార్చివేశారని ఆరోపించారు. ఆదివారం విశాఖలో ఒక ప్రైవేట్ హోటల్లో ప్రైవేట్ కాలేజీల యజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేసి వైసీపీకి ఓటు వేయాలని, లేకపోతే మీకు ఇబ్బందులు తప్పవని ఆయన హెచ్చరించడం దారుణమని, ఆ సమయంలో వామపక్ష ప్రజా సంఘాల వారు ఆ హోటల్లోకి వెళ్లి వీడియో తీస్తుంటే వంట గదిలో నుంచి వీసీ పారిపోయారని తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి వీసీపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు కోరారు.

గోదావరి డెల్టాకు 3 వేల క్యూసెక్కుల నీరు

జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ సూపరిండెంటెంట్ ఇంజనీర్ ప్రశాంత్‌కుమార్



విశాలాంధ్ర-సీలేరు (అల్లూరి జిల్లా) : డొంకరాయి జలాశయం నుంచి గోదావరి డెల్టా రబీ పంటలకు మరో 3 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని సీలేరు కాంప్లెక్స్ సూపరిండెంటెంట్ ఇంజనీర్ కె.కె.వి .ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గోదావరి డెల్టా రబీ పంటలకు ఇప్పటి వరకు పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి అనంతరం 4,300 క్యూసెక్కుల నీరు వెళ్లేదని, రాజమండ్రి వద్ద గోదావరి నదిలో నిల్వలు తక్కువగా ఉన్నాయని, రబీ పంటలకు నీరు చాలకపోవడంతో అదనపు నీరు అవసరమని గోదావరి ఇరిగేషన్ అధికారులు తెలిపారన్నారు. ఈ మేరకు డొంకరాయి జలాశయం నుంచి అదనంగా మరో 3 వేల క్యూసెక్కుల నీటిని నెల రోజుల పాటు విడుదల చేస్తున్నామని చెప్పారు. ఇరిగేషన్ అధికారులు నెల రోజుల పాటు అదనపు నీటిని విడుదల చేయాలని కోరినప్పటికీ, సీలేరు కాంప్లెక్స్‌లో నీటి నిల్వలు ఉన్నాయని, సీలేరు కాంప్లెక్స్ పరిధిలో ఎనిమిది మిలియన్ యూనిట్ల నుంచి 8.5 మిలియన్ యూనిట్ల వరకు గ్రిడ్ అధికారుల ఆదేశాల మేరకు విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని ఎస్ఈ తెలిపారు.

సంపాదకీయం

ప్రతిపక్ష ఐక్యత అవశ్యం

మనదేశ ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ఎన్నడూ లేనంతగా ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. స్వాతంత్ర్య లక్ష్యాలు గాలికి ఎగిరిపోయాయి. దాదాపు తొమ్మిదేళ్ల పాలనాకాలంలో పేదరికం పెరిగిందేకానీ తరగలేదు. రాష్ట్రాల అనేక హక్కులను నరేంద్రమోదీ ప్రభుత్వం స్వాయత్తం చేసుకుంది. పత్రిక,మీడియా స్వేచ్ఛ హరించుకుపోయి పాలకులకు అణగిమణిగి పనిచేస్తున్నారు. ప్రభుత్వ అనుకూల మీడియా కార్పొరేట్ల వశమైంది. మోదీ అధికారంలోకి వచ్చిన నాటినుండి తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడిన మేధావులను, ప్రశ్నించిన వారిని జైళ్లలో పెట్టి వేధిస్తున్నారు. న్యాయవ్యవస్థ చాలాసార్లు పాలకులకు అనుకూలంగా పనిచేస్తుందన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాదు ఇటీవల సుప్రీంకోర్టును సైతం బెదిరింపు ధోరణితో న్యాయశాఖమంత్రి మాట్లాడుతున్నారు. ప్రతిపక్షాన్ని పూర్తిగా అణగదొక్కి బీజేపీ పాలనను దీర్ఘకాలం కొనసాగించి ఆర్ఎస్ఎస్ లక్ష్యమైన హిందు రాష్ట్రాన్ని సాధించేదిశగా సర్వవ్యవస్థలపై మోదీ ప్రభుత్వం ఆధిపత్యం చెలాయిస్తున్నది. దేశ ఆర్థికవ్యవస్థను కుదేలుపరిచే అనేక నిర్ణయాలు మోదీ ఏకపక్షంగా తీసుకొని అమలు జరిపారు. ఫలితంగా నిరుద్యోగం, పేదరికం పెరిగాయి. ఈ స్థితిలోనూ ప్రతిపక్షాలన్నీ ఒక్కతాటిపైకివచ్చి 2024లో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొంది ఇంతకంటే మెరుగైనపాలన అందించాలని అత్యధిక దేశ ప్రజలు కోరుకుంటున్నారు. జాతీయస్థాయిలో ప్రధాన ప్రతిపక్షం గణనీయంగా బలహీనపడింది. వామపక్షాల పరిస్థితీఇదే. మోదీపాలన కార్పొరేట్ల పాలనగా మారింది. కార్పొరేట్ దిగ్గజం అదానీ గ్రూపు కుంభకోణం వెలుగుచూసిన నేపథ్యంలో మోదీ ప్రభుత్వం బాగా అప్రతిష్టపాలైంది. మోదీకి అత్యంత సన్నిహితుడి కుంభకోణం మూలంగా ఆయనకు అప్పులిచ్చిన ప్రభుత్వరంగ బ్యాంకులు, ఎల్ఐసీ, ఇతర ఆర్థికసంస్థలు వేలాదికోట్ల రూపాయలు నష్టపోయాయి. స్టాక్‌మార్కెట్‌లో అదానీ గ్రూపు షేర్లు కొనుగోలుచేసిన వారంతా లక్షల కోట్లు నష్టపోయారు. అయినప్పటికీ మోదీ మౌనం వహిస్తుండగా ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకులు అదానీకి అండగా నిలవడం దారుణం. పార్లమెంటరీ కమిటీ దర్యాప్తు నిర్వహించి దోషిని నిర్ధారించి శిక్షించవలసిన మోదీ ప్రభుత్వం తిరస్కరించింది. అంతర్జాతీయంగా మోదీ ప్రభుత్వంపై తీవ్ర సందేహాలు వ్యక్తమయ్యాయి. అదానీ కుంభకోణం మూలంగా దేశంలో పెట్టుబడులుపెట్టేవారు వెనుకాడుతున్నారన్న వార్తలు వెలువడ్డాయి. మోదీ పాలనాకాలంలో బ్యాంకులకు ఎగవేసిన మొండి రుణబకాయిలు 12లక్షల కోట్ల రూపాయలకుపైగా రద్దుచేసి లక్షలమంది సామాన్య డిపాజిట్ దారులను నష్టపరిచారు.

ఈ తరుణంలో కాంగ్రెస్ పార్టీ ముందుకువచ్చి తక్షణం ప్రతిపక్ష ఐక్యతను సాధించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉంది. గతంలో రెండు,మూడుసార్లు మోజారిటీ ప్రతిపక్షాలు సమావేశమై సంప్రదింపులు జరిపినప్పటికీ ఒక సంఘటన ఏర్పడలేదు. తాజాగా బిహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ కాంగ్రెస్ ప్రతిపక్షాన్ని ఐక్యంచేసే బాధ్యత తీసుకోవాలని సూచించారు. అతి పెద్ద ప్రతిపక్షమైన కాంగ్రెస్ లేకుండా ఇతర ప్రతిపక్షాలు కొన్ని సంఘటనల్లో కలిసివచ్చే అయా పార్టీలు ఎక్కువగా ఉన్నప్పటికీ, కొన్ని బలమైన పార్టీలు దూరంగా ఉంటున్నాయి. ముఖ్యంగా పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి తృణమూల్ కాంగ్రెస్ అధినేత మమతాబెనర్జీ మొదట హడావుడి చేసినప్పటికీ ఇప్పుడు మౌనంగా ఉంటున్నారు. అయినప్పటికీ ఆమె మోదీ పాలనను వ్యతిరేకిస్తున్నారు. అలాగే తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలక టీఆర్ఎస్ పార్టీని జాతీయపార్టీగా మార్చి బీజేపీ పాలనను తీవ్రంగా దుయ్యబడుతున్నారు. కానీ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు దూరమే. మమతాబెనర్జీ కూడా రాష్ట్రంలో కాంగ్రెస్‌తో కయ్యానికి రెఢీగా ఉంటారు. ఈ స్థితిలో ప్రతిపక్షాల ఐక్యత ఎలాసాధ్యమని సందేహాలు వ్యక్తంచేసే వారున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ఆంధ్రప్రదేశ్, అరుణాచల ప్రదేశ్, ఒడిశా, సిక్కిం రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. మరో రెండు నెలల్లో కర్ణాటక అసెంబ్లీకి జరగనున్న ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచేందుకు అవకాశాలున్నందున కాంగ్రెస్ తక్షణం ప్రతిపక్షాల ఐక్యతకు ఈనెల 24న జరగనున్న ప్లీనరీ సమావేశంలో ఒక నిర్ణయం తీసుకోవడం అవసరం. ఈ సమావేశం ప్రతిపక్షాల ఐక్యతపైన చర్చిస్తుందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ చెప్పారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ తాజాగా చేసిన జోడోయాత్ర కాంగ్రెస్ శ్రేణుల్లో విశ్వాసం నింపిందని అనేక విశ్లేషణలు వచ్చాయి. రాహుల్ సైతం పరిపక్వత సంతరించుకున్నారని ఆయన ప్రసంగాలు, పత్రికాగోష్టులలో ఇస్తున్న సమాధానాలు తెలియ జేస్తున్నాయి. అయితే ఎన్నికల్లో ఈ సానుకూలతను ఓట్లుగా మార్చు కొనేశక్తి, స్థోమతులను కాంగ్రెస్ పెంచుకోవాలి. తగిన యంత్రాంగం లేకుండా ఓట్లు రావడం అంత తేలికకాదు. ఆర్ఎస్ఎస్, బీజేపీల ఎన్నికలు, ప్రచారయంత్రాంగం చాలా బలమైంది. లోక్‌సభ ఎన్నికలకు ముందు ఈ ఏడాది కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలకు ఎన్నికలు జరిగేనాటికి ప్రతిపక్షాలు ఐక్యంగా పనిచేయగలిగితే దేశప్రజల్లో విశ్వాసం నెలకొంటుంది. కాంగ్రెస్‌తోపాటు నితీష్, శరద్‌పవర్ తదితరులు ఈ దిశగా తక్షణం పూనుకోవాలి. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం పరిరక్షణకోసం, స్వాతంత్ర్య లక్షాల సాధనంకోసం ప్రతిపక్షాలు సొంత ప్రయోజనాలకంటే ఐక్యతకు ప్రాధాన్యతనివ్వాలి.

అసాధారణ వాతావరణ మార్పులకు కారణమేమి..?

– మధుపాళి

హైదరాబాదు మహానగరంతో పాటు తెలంగాణలో అనేక జిల్లాలు, ఇతర దక్షిణ భారత రాష్ట్రాల్లోని చాలా ప్రాంతాలు అసాధారణ చలి గాలులతో ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల సెల్సియస్ కన్న తక్కువగా నమోదు కావడం, ఉషోదయాన మంచు దుప్పట్లు కప్పడం లాంటి ప్రతికూల వాతావరణ మార్పులతో జనం గజగజ వణికిపోతున్నారు. ఇలాంటి ప్రతికూల వాతావరణ మార్పులకు మూలాలుగా సహజ కారణాలతో పాటు మానవ- ప్రమేయ కారణాలు కూడా తోడయ్యాయని పర్యావరణ నిపుణులు వివరిస్తున్నారు. రాబోయే సంవత్సరాల్లో వాతావరణ ప్రతికూల మార్పులు క్రమంగా పెరగవచ్చని కూడా హెచ్చరిస్తున్నారు.

సాధారణంగా వేడిగా ఉండే దక్షిణ భారత రాష్ట్రాల్లో నేడు అసాధారణ అతిశీతల గాలులతో ఎముకలు కొరికే చలిలో ప్రజలు అవస్థలు పడుతున్నారు. రాజెంద్రనగర్‌లో 7.8 డిగ్రీ సెల్సియస్, సికింద్రాబాదులో 8.9 డిగ్రీలు, అల్వాల్‌లో 9.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో వాతారణ శాఖ హైదరాబాదు నగరంలో “ఆరెంజ్ అలెర్ట్” హెచ్చరిక చేసే వరకు పరిస్థితులు దిగజారడం జరిగింది. ఉత్తర మైదాన హిమాలయన్ శీతల పవనాలకు తోడుగా ఈశాన్య ప్రాంతాల నుంచి శీతల పవనాలు కూడా వీచడంతో నేడు తెలంగాణతో పాటు దక్షిణ భారతం తీవ్ర చలితో ముసుగేసి పడుకుంది. భారత వాతావరణ శాఖ వివరాల ప్రకారం ఉత్తర తెలంగాణ జిల్లాలు, జంట నగరాల్లో మరి కొన్ని రోజులు ఇలాగే చలి గాలులు, అత్యల్ప ఉష్ణోగ్రతలతో ఇబ్బంది పెట్టవచ్చని హెచ్చరిస్తున్నారు. మానవ ప్రమేయ వాతావరణ మార్పులే ఈ శీతల గాలులకు కారణమని నిపుణులు వివరిస్తున్నారు. గతంలో ఇలాంటి ఉత్తర భారత మైదాన హిమాలయన్ పవనాలను దట్టమైన అడవులు, కొండలు, గుట్టలు అడ్డుకునేవి. నేడు ఆధునిక డిజిటల్ యుగపు మానవుడు అనాలోచితంగా, విచక్షణారహితంగా, అవగాహన లేమితో, స్వార్థ చింతనతో అడవులను నరికి వేయడం, గ్రానైట్ వ్యాపార నెపంతో కొండలను, గుట్టలను మింగేయడంతో శీతల పవనాలు నేరుగా, వేగంగా దక్షిణ భారతాన్ని కమ్మేస్తున్నాయని వివరిస్తున్నారు. ప్రతి ఏట జనవరి మాసంలో హైదరాబాదు నగరంలో చలి గాలులు వీచేవని, నేడు రుతు మార్పులు జరిగే సంధి కాలంలో ఇలాంటి అతి శీతల వాతావరణం అనుభవంలోకి వస్తున్నట్లు తెలుపుతున్నారు.

భారత వాతావరణ శాఖ ప్రకటించే “ఆరెంజ్ అలర్ట్”తో ప్రజలు అసాధారణ ప్రమాదకర వాతావరణ మార్పులను తట్టుకోవడానికి సంసిద్ధులుగా ఉండాలని, పొగ మంచు లేదా ఫాగ్ కమ్మేయడంతో రోడ్లు మసకబారి దారులు కనిపించవని, ట్రాఫిక్ కదలికలు మందకొడిగా ఉంటాయని అవగాహనకు రావలసి ఉంటుంది. హైదరాబాదు ప్రాంతంలో 2022లో రుతుపవనాలు అక్టోబర్ వరకు కొనసాగడంతో హరిత పరిసరాలు పెరగడం, చలి కాలం నవంబర్ చివర నుంచి ప్రారంభం కావడంతో ఫిబ్రవరి మాసంలో కూడా అసాధారణ అతి శీతల పవనాలు వీచడం జరుగుతున్నట్లు తెలుస్తున్నది.

శాస్త్రసాంకేతిక అభివృద్ధి ఫలాలను అనుభవిస్తున్న నవ్య నరుడు అతి తెలివి, అజ్ఞానం, అవగాహనలేమి, స్వార్థ వ్యాపార లాభాపేక్ష ఆలోచనలతో అడవులను నరకడం, పోడు సాగు కోసం హరిత వనాలను తొలగించడం, గ్రానైట్ వ్యాపారం పేరుతో గుట్టలు/ బండలను మింగే బకాసురులు పుట్టుకురావడం, గ్రానైట్ వ్యాపారులే రాజకీయ నాయకులుగా అవతారమెత్తడం, పారిశ్రామిక కాలుష్యం పెరగడం లాంటి అనేక కారణాలతో వాతావరణ ప్రతికూల మార్పులు చోటు చేసుకుం టున్నాయని తెలుసుకోవాలి.

ప్రకృతి మాతను పరిరక్షించుకుంటేనే మనిషి మనుగడ సాధ్యమని మరిచిన నడమంత్రపు నరుడు రాబోయే తరాల ఆవాసాలను నరక కూపాలుగా మార్చడం జరుగుతున్నది. అతి తెలివితో తాను కూర్చున్నా కొమ్మను తానే నరుక్కుంటున్నాడు. తెలివి పెరిగిన కొద్దీ విచక్షణ తరుగుతోంది. తాను తొవ్విన గోతిలో తానే పడేందుకు సిద్ధం అవు తున్నాడు. అంతరిక్ష రహస్యాలను ఛేదించినా, ప్రపంచాన్ని కుగ్రామంగా మార్చినా, సముద్ర లోతులను అన్వేషించినా తాను నేల మీద నిలకడగా నిలబడడం మరిచి కాలుష్య కత్తితో సాము చేస్తున్నాడు. ఇప్పటికైన వెంటనే కళ్లు తెరిచి దీపం (సానుకూల వాతావరణ మార్పులు) ఉండగానే ఇల్లును (భూమాతను) చక్కదిద్దుకోవాలి. రాబోయే తరానికి ఆస్తుల కన్న ముందు నివాసయోగ్య భూమాతను అమూల్య బహుమతిగా అందించాలి.

గవర్నర్లా? రాజకీయ ‘డోలక్‌లా’?

“ఒక రాజకీయ నాయకుడు రాజకీయపరంగా ఎన్నికల్లోనో విజయం పొందినంత మాత్రానవారు ప్రధానమంత్రి పదవినో మరొక పదవినో స్వీకరించినంత మాత్రాన న్యాయమూర్తులు వారిపై పొగడ్తలు కురిపించేస్థితికి అలవాటుపడితే న్యాయవ్యవస్థపైనే ప్రజల విశ్వాసం కాస్తా సడలిపోతుందని మరచి పోరాదు” -జస్టిస్ వి.డి.తుల్జా పూర్కర్ (1980లో ఉవాచ)

“ఆలోచనలోనూ ఆచరణలో ప్రవర్తనలోనూ ప్రభుత్వాలు రాష్ట్రాల్లో, కేంద్రంలో కులాతీత, మతాతీత భావాలకు అనుగుణంగా నడుచుకోవాలని భారత రాజ్యాంగం నిర్దేశిస్తోంది. ఇందుకు విరుద్ధంగా ప్రభుత్వాలు రాజకీయపార్టీలు లౌకిక రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరించినప్పుడు గవర్నర్ల ద్వారా రాష్ట్రపతిపాలన అనివార్యం అవుతుంది”-సుప్రీం జస్టిస్ జీవన్‌రెడ్డి, జస్టిస్ ఎస్.సి అగర్వాల్ ప్రకటించిన తొమ్మిది మంది జడ్జిలలో ఏడుగురు ఉమ్మడి తీర్పు ఇవ్వగా ఇద్దరు మాత్రం మౌనం వహించారు. (11.03.1994, బొమ్మయ్ కేసు)

అలాగే, “న్యాయమూర్తులు పదవీ విరమణానంతరం రిటైర్మెంట్ దశలో రాజకీయ ప్రాపకం ఫలితంగా తమకువచ్చే ఎలాంటి పదవినీ స్వీకరించరాదని స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలి”-జస్టిస్ ఎ.పి.షా భారత లా కమిషన్ మాజీ అధ్యక్షులు(16.02.2023)

ఇదిలాఉండగా, “గవర్నర్లు అనేవారు పాలనా రాజకీయ వ్యవహారాల్లో తలదూర్చరాదని మహారాష్ట్ర పరిణామాల సందర్భంగా స్వయాన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ప్రధాన న్యాయమూర్తి డీ.వై చంద్రచూడ్ తాజాగా ప్రకటించాల్సి వచ్చింది. (15.02.2023)

ఇంతకీ విచిత్రమేమంటే, ఇంతమంది రాజ్యాంగ నిపుణులు, న్యాయశాస్త్ర కోవిదులు, రిటైర్మెంటు దశలో ఉన్న న్యాయమూర్తులకు ధర్మాసన విధుల గురించి ‘క్లాసు’ తీసుకొంటున్న ఘడియల్లోనే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ప్రకటించిన గవర్నర్లలో కొంతమంది వివాదాస్పదమైన జస్టిస్‌లు కూడా ఉండటం, దేశంలో అదో చర్చనీయాంశంగా తలెత్తడం జరిగింది. అలాంటి వివాదాస్పద న్యాయమూర్తుల్లో ఒకరుగా వార్తల్లోకి ఎక్కినవాడు జస్టిస్ అబ్దుల్‌నజీర్. మొన్నటిదాకా ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా ఉంటూ విధినిర్వహణలో పేరు ప్రఖ్యాతులు పొందిన సీనియర్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌ను నిష్కారణంగానూ, అకస్మాత్తుగానూ పాలకవర్గ సలహాపై బదిలీ చేయవలసివచ్చింది. ఈ ఆకస్మిక పరిణామాలు కూడా ఎటువంటి వివాదాస్పద పరిస్థితుల్లో జరిగింది? మద్రాసు హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా శ్రీమతి లక్ష్మణ చంద్ర విక్టోరియా గౌరి భారత రాజ్యాంగానికి కట్టుబడి విధులు నిర్వహిస్తానని ప్రతినబూనుతున్న క్షణంలో చెన్నయ్‌కి చెందిన పలువురు న్యాయవాదులు దూసుకువచ్చి “విక్టోరియా గౌరి మతమైనారిటీలకు వ్యతిరేకంగా దూషిస్తూ ప్రసంగాలు చేస్తూ వచ్చినందున ఆమె హైకోర్టు న్యాయమూర్తి హోదాకు తగరని ఫిర్యాదు దాఖలు చేశారు. అయితే ప్రస్తుతానికి ఆమె నియామకం గురించి సుప్రీం ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా ఆ విషయాన్ని పెండింగ్‌లో పెట్టింది. ఆమె 2006 నుంచి 2020 మధ్యకాలంలో బీజేపీతో కలిసిఉండి, ఆ పార్టీ మహిళా మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఆమె దళితులకు వ్యతిరేకంగా విద్వేష ప్రసంగాలను బీజేపీ నాయకురాలుగా చేసి ఉన్నందున ఈ నెల (ఫిబ్రవరి1)లో 21 మంది న్యాయవాదులు సంయుక్తంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖరాస్తూ విక్టోరియా గౌరి న్యాయమూర్తి పదవికి తగరని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన 24 మంది న్యాయవాదులే కాకుండా మరికొందరు న్యాయవాదులు కలిసి మొత్తం మద్రాసు హైకోర్టు బెంచ్ నుంచి మరింతమంది లాయర్లుతోడై మొత్తం 98 మంది లాయర్లు విక్టోరియా గౌరికి అనుకూలంగా కోర్టుకెక్కారు. ఈ విచిత్రమైన విపత్కర పరిణామాలు ఇలా ఉండగానే సుప్రీం గౌరవ ప్రధానన్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ మహారాష్ట్ర పరిణామాల సందర్భంగా మాట్లాడుతూ, రాజకీయ పరిణామాలు, రాజకీయ ఉద్యమాల గురించి గవర్నర్లు ప్రదర్శించిన ఉత్సాహాన్ని లేదా ఆసక్తి పట్ల ఆశ్చర్యం వ్యక్తంచేస్తూ, రాష్ట్రంలో ఒక ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆ ప్రభుత్వం శాసనవేదిక నుంచి విశ్వాస ప్రకటన కోరుకుంటుందని, ఆ సందర్భంలో రాజకీయ పరిధిలోకి గవర్నర్ ప్రవేశించకూడదనీ పాఠం చెప్పాల్సి వచ్చింది! అంతేగాదు, మరో సందర్భంలో జస్టిస్ చంద్రచూడ్ మాట్లాడుతూ, రిటైర్మెంట్ తర్వాత కూడా న్యాయమూర్తులు పాటించవలసిన నైతిక నియమాలగురించి ప్రస్తావిస్తూ “రిటైర్మెంట్ తర్వాత పదవులకోసం ఎదురుచూసే న్యాయమూర్తులు తమ స్వాతంత్ర్యాన్ని మాత్రం అమ్మకానికి కుదువబెట్టరాదని” ఉత్తమమైన సలహా యిచ్చారు. దీనిపైన లా కమిషన్ మాజీ చైర్మన్ ఏ.పీ.షా వ్యాఖ్యానిస్తూ “ఈ విషయంలో న్యాయమూర్తులు భారత ప్రజలకు లిఖిత పూర్వకమైన ఒప్పందం ద్వారా హామీ పడకపోవచ్చుగాని అది వారి నైతిక బాధ్యత” అని స్పష్టం చేయాల్సి వచ్చింది.!

జస్టిస్ నజీర్ ఎందుకు నియమితులయ్యారు? ఇటీవల బీజేపీ పాలకమండలి సలహాపైన రాష్ట్రపతి ఆరు రాష్ట్రాల్లో కొత్తగా నియమించిన గవర్నర్లలో ఆంధ్రప్రదేశ్‌కు ఎంపికచేసిన జస్టిస్ అబ్దుల్ నజీర్ ఒక్కరే సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి”. ‘తలాక్’ అంశంపైన ముస్లిం మహిళల గౌరవహక్కుల్ని సమర్థించడమేకాకుండా, పౌరుల “గోప్యత” హక్కును ప్రాథమిక స్వతంత్రంగా గుర్తించి సమర్థించిన ఖ్యాతి నజీర్‌కు దక్కింది. అయితే అర్థాంతరంగా మోదీ ప్రభుత్వం చడీచప్పుడులేకుండా దేశంలో “దొంగనోట్ల చెలామణీ ముమ్మరాన్ని అరికట్టే పేరిట అర్థాంతరంగా పెద్ద కరెన్సీ నోట్లను చెలామణీ నుంచి తొలగించిన నిర్ణయం మూలంగా కోట్లాది మంది దేశ ప్రజాబాహుళ్యం బ్యాంకుల వద్ద మారక లావాదేవీల ఇబ్బందులకు గురై రోజుల తరబడి గంటలకొలదీ పడిగాపులుపడిన ఫలితంగా సుమారు 130 మంది చనిపోయారు. ఈ దారుణ పరిణామానికి దారితీసిన బీజేపీ పాలకుల నిర్ణయాన్ని సమర్థించినవారు జస్టిస్ నజీర్! అంతేగాదు, అయోధ్యలో ఉండాల్సిన రామమందిరం స్థానంలో మసీదు నిర్మాణం ఉందన్న వాదనకు అనుకూలంగా తీర్పుఇవ్వడంలో నజీర్‌కు ప్రమేయం ఉండడం! “హిందు” పత్రిక ప్రత్యేక లీగల్ విలేకరి కృష్ణదాస్ రాజా గోపాల్ పేర్కొన్నట్లు (12.02.23) “వివాదాస్పదమైన రామజన్మభూమి టైటిల్‌ను హిందువులకు దఖలు పరచాలని తీర్పు చెప్పిన ప్రత్యేక “అయోధ్య ధర్మాసనంలో ఏకైక మైనారిటీ కమ్యూనిటీకి చెందిన ఏకైక జడ్జి నజీర్ కావడం ఇంకో విశేషం! ఆ మాటకొస్తే అయోధ్య భూ వివాదంలో పాలకవర్గం తరఫున కొమ్ముకాయడానికి ఏ పరిస్థితుల్లో సుప్రీం మాజీ న్యాయమూర్తి జస్టిస్ గొగోయ్ అయోధ్య తీర్పును రామమందిర నిర్మాణాన్ని ఆకస్మికంగా భుజాన వేసుకొని సమర్థించాల్సి వచ్చిందో, అవమాన పడవలసివచ్చిందో మనకు తెలుసు. గొగోయ్ లైంగిక వేధింపులకు గురైన గొగోయ్ ఆఫీసు ఉద్యోగిని ఆయన గుట్టురట్టు చేసిన సమయంలో ఆ అవకాశాన్ని ఆసరా చేసుకుని బీజేపీ పాలకులు గొగోయ్ చేతులు విరిచి మరీ అనుకూలంగా సంతకం గుంజుకున్న సంగతి లోకానికి నాడే తెలిసిపోయింది. అందువల్ల అకస్మాత్తుగా ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా ఉన్న అత్యంత సీనియర్ గవర్నర్‌గా పరిణిత మనస్సుగల విశ్వభూషన్ హరిచందన్ స్థానంలో ఇప్పుడు వచ్చిన అబ్దుల్‌నజీర్ పౌరుల “గోప్యత హక్కును” ప్రాథమిక హక్కుగా పరిగణించి మంచి తీర్పును లోగడ అదించిన న్యాయమూర్తి. అవకాశవాద రాజకీయాలకు అగ్రస్థానం ఇవ్వడంలో కాంగ్రెస్ పాలక నాయకులు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీలు బీజేపీ పాలకులకు ఏమాత్రం తీసిపోనివారేనని ఎమర్జెన్సీ రోజులు నిరూపించాయి. అందువల్ల నాడు అల్హాబాదుకోర్టు నిరంకుశ(ఎమర్జెన్సీ) పాలనకు అంకుశమై ఎలా స్వస్తి చెప్పించిందీ మనకు తెలుసు. చివరకి అరుణ్‌జైట్లీ లాంటి బీజేపీ నాయకులు సైతం పదవీవిరమణానంతరం న్యాయమూర్తులకు పదవుల ఎరజూపి లోబరుచుకునే పాలనా పద్ధతులు మారాలని కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు మీసాలుతిప్పి మరీ ‘సుద్దులు’ వల్లించినవాళ్లే!. జస్టిస్ జీవన్‌రెడ్డి, జస్టిస్ ఎస్.సి. అగర్వాల్ చెప్పినట్లు “ఆలోచనలో, ఆచరణలో ప్రభుత్వం మతాతీత, కులాతీత లౌకికరాజ్యాంగ శక్తిగానే ఉండాలని రాజ్యాంగం ఆదేశిస్తోంది. ఈ ఆదేశాన్నే రాజకీయపార్టీలు అనుసరించాలని కోరకుంటోంది”. రేపు ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగవర్నర్ నజీర్ కూడా ఆదేశానికి కట్టుబడి తీరక తప్పదు! లేకపోతే, ఆకస్మాత్తుగా నజీర్ నియామకాన్ని మరోలా భావించే ప్రమాదముంది!

ఇంతకూ కాలం ఎప్పుడు జే కొడుతుందో ఓ కవికుమారుని మాటల్లో విందాం.

మనం-

“కలవరపడి వెనుదిరిగితే కాలం ఎగపడుతుంది.
కదనుతొక్కి చెలరేగితే కాలం భయపడుతుంది.
కర్మయోగి ఎన్నడూ కాలాధీనుడు కాదు
కనురెప్పలు మూతపడితే కాలం జోకొడుతుంది.
కంఠమెత్తి తిరగబడితే కాలం జే కొడుతుంది.”!
(బహంపరాక్-ఆంధ్రప్రదేశ్)!!

– ఎబికె ప్రసాద్

బూటకపు రాజకీయ పార్టీలతో పెద్ద చిక్కు!

దేశంలో దాదాపు మూడువేల రిజిస్టర్ అయిన రాజకీయ పార్టీలున్నాయి. వీటిల్లో అత్యధికభాగం బూటకపు రాజకీయ పార్టీలే. ఇది ఎలాంటి ప్రజాస్వామిక కార్యకలాపాలు నిర్వహించవు. చట్టపరంగా ఉన్న మినహాయింపులను ఉపయోగించుకుని కేవలం ఎన్నికల కమిషన్ పార్టీపేరు రిజిస్టర్‌చేసి సొంత ప్రయోజనాలకోసం మాత్రమే పనిచేస్తుం టాయి. ఈ బూటకపు కంపెనీలు భారీ కుంభకోణాలకు పాల్పడుతుంటాయి. గౌతమ్ అదానీ కూడా విదేశాల్లో ఇలాంటి బూటకపు కంపెనీలను నెలకొల్పి వాటి ద్వారా డబ్బు సంపాదించాడనే ఆరోపణలు ఉన్నాయి. రాజకీయపార్టీలకు చెందినవారు కూడా ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. పన్నుల ఎగవేత నుంచి డబ్బు దుర్వినియోగం చేసుకున్నారు.

ఈ విధంగా వేలదికోట్ల రూపాయాలు అక్రమంగా సంపాదిస్తున్న పార్టీలున్నాయి. ఉదాహరణకు ముంబైలోని బొరివలి ప్రాంతంలో దత్తపడ రోడ్డు ఏరియాల్లో ఎక్కువగా మధ్యతరగతి జనాభా నివసిస్తుంటారు. అక్కడ ఒక వాణిజ్య స్థలం ఉంది. అయితే అక్కడ భవనంబైట సర్దార్ వల్లభాయ్‌పటేల్ పార్టీ అన్నబోర్డు కనిపిస్తుంటుంది. భవనం లోపల వ్యాపార కార్యకలాపాలు ఉంటాయి. భవనంలోని ఒక చిన్న గదిలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ అధ్యక్షుడు అయినా, దశరథ్ భాయ్ పరేఖ్ ఒక ప్లాస్టిక్ స్టూలుమీద కూర్చుని ఉంటారు. ఆయన పెద్ద వయసువారు. ఆయన అక్కడ కట్టలు కట్టలు గాలిపటాలు తయారుచేస్తుంటారు. గాలిపటాలు సరఫరా చేసే వ్యాపారం అయనది. రాజకీయ పార్టీ అంటే ఆయనదృష్టిలో సామాజిక సేవ అంటారు. తాను మొరార్జీ దేశాయ్, శరద్‌పవర్, మాయావతిలాంటి రాజకీయ నాయకులతో కలిసి పనిచేశానని, ఆ తరువాత 2006లో రాజకీయపార్టీ ఏర్పాటుచేశానని అంటారు. అయితే ఇటీవల ఆ పార్టీ ఎన్నికల కమిషన్ దృష్టిలో పడింది. ఆ తరువాత ఆదాయపన్ను అధికారులు కలుగజేసుకున్నారు. కోట్లాది రూపాయాల ఆర్థిక అక్రమాలకు పార్టీని అడ్డుపెట్టుకుని పాల్పడ్డారని ఆదాయపు పన్నుశాఖ అధికారులు వెల్లడించారు. అయితే ఆయన ఇవన్నీ ఒట్టి ఆరోపణలని దాతలు, వివిధ సంస్థలు, వాణిజ్య సంస్థలు, జౌళి, డైమండ్ పరిశ్రమాధిపతులు అలాగే రియల్ ఎస్టేట్ రంగంలో ఇంకా అనేకమంది తనకు ఇచ్చే విరాళాలు ఇవని చెబుతారు. 2022 సెప్టెంబరులో ఆదాయపు పన్నుశాఖ అధికారులు పార్టీ భవనంపై దాడులుచేసి సంబంధింత పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఎందుకంటే కట్కే ఉదయం బైటకు వెళ్లిపోయి తిరిగి సాయంకాలమే ఇంటికి చేరుకుంటారు. అందువల్ల ఆయన కార్యకలాపాలు ఎవరికీ తెలియదు. గత సంవత్సరం ఆ చిన్న ఇంటిపై ఆదాయపు పన్ను శాఖాధికారులు దాడులు చేసినప్పుడే ఆయనగుట్టు బైటపడింది. దాదాపు ఆరుకోట్ల రూపాయలకుపైగా అక్రమాలకు పాల్పడినట్లు అధికారులు వెల్లడించారు. ఆయనకు పెద్దపెద్ద వాళ్లతో సంబంధాలు ఉన్నాయని ఎన్నికల కమిషన్ వెల్లడించింది.

ఉత్తరప్రదేశ్‌లోనూ ఇలాంటిదే మరొకటి వెలుగు చూసింది. లక్నో నుంచి రెండున్నర గంటల ప్రయాణ దూరంలోఉన్న సుల్తాన్‌పూర్ మార్కెట్ లోతట్టుప్రాంతంలో గడియారాలు బాగుచేసే షాప్ ఉంది. అప్నాదేశ్ పార్టీ చిరునామా ఈ షాపే. షాపు ఉన్న గదిలో చిన్న వ్యాపారం, అలాగే రాజకీయ పార్టీ కార్యాలయం ఉందని రిజిస్టర్ అయింది. అయితే ఈ గదిలో జరిగే కార్యకలాపాలు భారీ కుంభకోణానికి సంబంధించినది. అబ్దుల్ మబూద్ ఈ షాపు యజమాని. ఆయనే పార్టీ అధ్యక్షుడు కూడా.

పార్టీ పేరుతోఈయన వసూలుచేసే విరాళాలకు ఆదాయపుపన్ను మినహాయింపు ఉంది. అయితే తాను ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని గుజరాత్ రాష్ట్ర పార్టీ యూనిట్ అధ్యక్షుడిగా నియమించిన రజాక్ మోసాలకు పాల్పడగా తనమీద అన్యాయంగా ఆరోపణలు చేస్తున్నారని మబూద్ అన్నారు. అంతేకాదు పార్టీ పాన్ కార్డును కూడా తనకు తెలియకుండా నిధుల వసూళ్లకు వాడుకున్నాడని గుజరాత్‌లో బ్యాంకు ఎకౌంట్ కూడా ఏర్పాటుచేసి నిధులు వసూలు చేశాడని మబూద్ చెప్పారు.

అయితే ఎన్నికల కమిషన్ చెప్పింది వేరే ఉంది. ఈ పార్టీకి ఇరువురు అధ్యక్షులు ఉన్నారని, ఇది చాలా వింతగా ఉందని, చిన్నగదిలోఉన్న రాజకీయ పార్టీకి వందకోట్లకుపైగా విరాళాలు వచ్చినట్లు చెప్పడం విడ్డూరంగా ఉందని కమిషన్ వ్యాఖ్యానించింది. అలాగే కాన్పూర్ పారిశ్రామిక ప్రాంతంలో ఇరుకుసందుల్లో జనరాజ్యపార్టీ ఉన్నట్లు రిజిస్టర్ అయింది. పార్టీ చిరునామా ప్రయాగ్ రాజ్ అని కమిషన్ వద్ద రిజిస్టర్ అయిఉంది. రిజిస్టర్ చేసిన రికార్డుల్లో రవిశంకర్‌యాదవ్ రికార్డు చేసినట్లుగా ఉంది. 2022 సెప్టెంబరులో రవిశంకర్ యాదవ్ నివాసాలపై ఆదాయపు పన్నుశాఖ అధికారులు దాడి చేశారు. ఆదాయపుపన్ను శాఖ నియమనిబంధనలను ఈ పార్టీ పూర్తిగా ఉల్లంఘించింది. సందులోఉన్న ఒక చిన్నపార్టీకి కోట్లాదిరూపాయలు విరాళాలుగా రావడమేంటని ఎన్నికల కమిషన్ సందేహించింది. ఆదాయపుపన్ను శాఖ అధికారులు కూడా ఇదే సందేహంతో దాడులుచేయగా, అసలు గుట్టు రట్టయింది. ఇలాంటి బూటకపు రాజకీయ పార్టీలు అనేక వందలు ఉన్నాయనేది ఈ ఘటనలను చూస్తే అర్థమవుతుంది.

ముంబైలో మరో సంఘటన కూడా ఉదహరిస్తాను. చున్నభట్టి ప్రాంతంలో స్వదేశీ మిల్స్‌రోడ్డులో జనవాది కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఉంది. అక్కడ రెండు అంతస్థుల భవనం బాల్కనీలో మూడురంగులు జెండాను పెట్టిఉంటారు. ఈ పార్టీ జాతీయ కార్యాలయం చిరునామా ఈ భవనమేనని రిజిస్టర్ చేశారు. అనంత్ స్వాంత్ అనే సీనియర్ పౌరుడికి చెందిన భవనం ఇది. దాన్ని జనవాది కాంగ్రెస్ పార్టీ అద్దెకు తీసుకుంది. ఈపార్టీ వివిధ అక్రమాలకు పాల్పడిందని తెలిసిన తర్వాత భవనాన్ని ఖాళీ చేయవలసిందిగా పార్టీ అధ్యక్షుడు సంతోష్ ఎం.కట్కేను కోరానని అనంత్ స్వాంత్ వెల్లడించారు. ఈ ప్రాంతానికి కిలోమీటర్ల దూరంలో వదాల మురికివాడ ఉంది. ఎన్నికల కమిషన్‌కి జనవాది కాంగ్రెస్‌పార్టీతో సంప్రదింపులు జరిపేందుకు శాంతి డబుల్స్ అనే చిరునామా ఇచ్చారు. ఈ చిరునామాలో కట్కే ఆయన భార్య, ఇద్దరు పిల్లలు నివసిస్తుంటారు. ఆయన కూడా అనేక కోట్ల రూపాయాల కుంభకోణానికి పాల్పడ్డారని ఆదాయపు పన్ను శాఖాధికారులు వెల్లడించారు. చుట్టుపక్కల నివసించేవారంతా ఈ విషయం తెలుసుకుని తీవ్ర విభ్రాంతికి గురయ్యారు.

– హరిహర్ స్వరూప్

చీలికలు... పీలికల 'జనతా'

- ఆది నుంచీ అదే తంతు
- కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మొదలై... బీజేపీకి చేరువయ్యే వరకు
- తాజాగా ఉపేంద్ర కుశ్వాహా కొత్త పార్టీ
- జేడీ(యూ)తో తేజస్వి చెలిమితో మారిన పరిణామాలు

న్యూఢిల్లీ/పాట్నా: జనతా పార్టీ అనేక చీలికలు... పీలికల నడుమ తన రాజకీయ చదరంగాన్ని కొనసాగిస్తోంది. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్రారంభమైన ఈ పార్టీ...బీజేపీకి చేరువయ్యే వరకు రాజకీయంగా అనేక విపరీత పరిణామాలను చవిచూసింది. దశాబ్దాలుగా జనతా పార్టీలో కుదుపులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇదే వరుసలో జనతా మూలాలతో మరొక కొత్త పార్టీ పుట్టుకు రానున్నది. 2024 జాతీయ ఎన్నికలకు ముందు ప్రధాని నరేంద్ర మోదీ వరుసగా మూడవసారి అధికారం కోసం ప్రయత్నిస్తున్న తరుణంలో ఈ తాజా పరిణామం ఎవరికి, ఏ పార్టీకి కలిసి వస్తుందనేది ప్రస్తుతానికి ప్రశ్నే. అయితే కేంద్రంలో మతతత్వ కాషాయ బీజేపీని ఎదుర్కోవాల్సిన సమయంలో ఈ కొత్త పార్టీ ఎటువైపు మళ్లుతుందనేది ఆసక్తిగా ఉంది. అసలు విషయంలోకి వెళితే... జనతాదళ్ (యూ) నాయకుడు ఉపేంద్ర కుష్వాహా, అతని మద్దతుదారులు పార్టీని విడిచిపెట్టి, రాష్ట్రీయ లోక్ జనతాదళ్ అనే సొంత పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు సోమవారం ప్రకటించారు. 2025 శాసనసభ ఎన్నికల్లో అధికార కూటమికి రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ)కి చెందిన తన డిప్యూటీ అయిన ఉపముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ నాయకత్వం వహిస్తారని జేడీ(యూ) నేత, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఇటీవల ప్రకటించిన తర్వాత కుశ్వాహా ఉలిక్కిపడ్డారు. ఇతర వెనుకబడిన తరగతులు (ఓబీసీ)కి చెందిన ప్రముఖ నేతగా ఉన్న కుశ్వాహా బీహార్ రాజకీయాల్లో నితీశ్ వారసుడిగా తనను తాను చూసుకున్నారు. 2014-2018 మధ్యకాలంలో కుశ్వాహా కేంద్రమంత్రిగా సన్నిహితంగా ఉన్న బీజేపీకి ఈ తాజా పరిణామం ప్రయోజనం చేకూర్చేలా ఉంది. బీహార్ ప్రతిపక్ష కూటమి వైపు నితీశ్ మారినప్పటి నుంచి కాషాయ పార్టీ తెలివిగా వ్యవహరిస్తోంది.

కాంగ్రెస్ వ్యతిరేకత... ఓబీసీ అజెండా

వాస్తవానికి కాంగ్రెస్ వ్యతిరేకత, వెనుకబడిన తరగతుల అనుకూల అజెండాలతో మొదట కట్టుదిట్టంగా ప్రారంభమైన జనతా రాజకీయాలు దశాబ్దాలుగా అనేక చీలికలను చవిచూశాయి. 1970వ దశకంలో భారతదేశం రెండవ సోషలిస్టు ఉద్యమం కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా జయప్రకాష్ నారాయణ్ అధ్వర్యంలో బీహార్ నుంచి ప్రారంభమైంది. మొదటిది 1960లలో డాక్టర్ రామ్ మనోహర్ లోహియా నేతృత్వంలో జరిగింది. జేపీ అనుచరులలో లాలూ యాదవ్, నితీశ్ కుమార్, రామ్ విలాస్ పాశ్వాన్ ఉన్నారు. కొంతమంది లోహియా-జేపీ అనుచరులు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి బీహార్‌ను తమ కర్మభూమిగా చేసుకున్నారు. ఉదాహరణకు కర్ణాటకకు చెందిన జార్జ్ ఫెర్నాండెజ్ బొంబాయి నుంచి రాగా, మధ్యప్రదేశ్‌కు చెందిన శరద్ యాదవ్ ఉత్తరప్రదేశ్ మార్గాన్ని తీసుకున్నారు. 1977 లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని ఇందిరా గాంధీ అధికారాన్ని కోల్పోయారు. మొరార్జీ దేశాయ్ నేతృత్వంలో జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పడింది. కానీ ఆయన ప్రభుత్వం ఎక్కువ కాలం కొనసాగలేదు. అతని డిప్యూటీ చరణ్‌సింగ్ తన మద్దతుదారులను విడిచిపెట్టి కొంతకాలం ప్రధాని అయ్యారు. 1980 లోక్‌సభ ఎన్నికల్లో ఇందిర మళ్లీ అధికారంలోకి వచ్చారు. చరణ్ సింగ్ సొంతంగా లోక్ దళ్‌ను స్థాపించారు. ఇది వివిధ రాష్ట్రాల నుంచి సోషలిస్టు నాయకులను ఆకర్షించింది. బీహార్ నాయకులు కూడా చేరారు. 1985లో కర్పూరి ఠాకూర్ అధ్వర్యంలో పని చేయడం ప్రారంభించిన ఉపేంద్ర కుశ్వాహా కూడా ఉన్నారు. 1984లో ఇందిరాగాంధీ హత్య అనంతరం రాజీవ్ గాంధీ అఖండ విజయం సాధించారు. అటుతర్వాత జనతా పార్టీని జనతాదళ్‌గా పునర్నిర్మించారు. వీపీ సింగ్ ప్రధానమంత్రి అయ్యారు. జనతాదళ్ నాయకులు (ఉదాహరణకు బీహార్‌లో లాలూ యాదవ్, ఉత్తరప్రదేశ్‌లో ములాయం సింగ్ యాదవ్) ముఖ్యమంత్రులు అయ్యారు. కేంద్రంలో వీపీ సింగ్ ప్రభుత్వం ఎక్కువ కాలం కొనసాగలేదు. ములాయం సింగ్ తన ప్రభుత్వాన్ని కాపాడుకోవడానికి మొదట చంద్రశేఖర్ కొత్త పార్టీ (జనతా చీలిక), కాంగ్రెస్‌తో కలిసి వెళ్లారు. ములాయం 1992లో సమాజ్‌వాదీ పార్టీని స్థాపించారు. 1997లో లాలూ ప్రసాద్ యాదవ్ బీహార్ సీఎం పదవికి రాజీనామా చేసి, దాణా కుంభకోణంలో జైలుకు వెళ్లే ముందు తన భార్య రబ్రీదేవిని తన కుర్చీపై కూర్చోబెట్టవలసి వచ్చింది. జనతాదళ్‌లో శరద్ యాదవ్... లాలూ యాదవ్ నాయకత్వాన్ని సవాలు చేశారు. లాలూ రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్‌జేడీ)ని స్థాపించారు. 1991, 1996లో మాధేపురా నుంచి గెలిచిన శరద్‌యాదవ్‌ను 1998లో ఓడించారు.

2018లో శరద్ యాదవ్ కొత్త పార్టీ

బీజేపీతో కలిసి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ఆర్‌జేడీ, కాంగ్రెస్, వామపక్షాలతో కూడిన మహాఘట్‌బంధన్ నుంచి వైదొలగాలని నితీశ్ కుమార్ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పోటీ చేసినందుకు జేడీ(యూ) నుంచి బహిష్కరణకు గురైన శరద్ యాదవ్ మద్దతుదారులు 2018లో లోక్‌తాంత్రిక్ జనతాదళ్‌ను ఏర్పాటు చేశారు. నితీశ్ నెలల తర్వాత బీజేపీని విడిచిపెట్టి, బీహార్‌లో మహాఘట్‌బంధన్‌కు తిరిగి వస్తాడని తెలియక 2022లో శరద్ యాదవ్ తన పార్టీని ఆర్‌జేడీలో విలీనం చేశాడు. ఆర్జేడీ రాజ్యసభ సభ్యత్వాన్ని పునరుద్ధరించకపోవడంతో మాజీ పార్లమెంటేరియన్‌గా ఉన్న శరద్ ఈ ఏడాది జనవరిలో మరణించారు. రామ్ విలాస్ పాశ్వాన్ కుమారుడు చిరాగ్, సోదరుడు పశుపతినాథ్ పరాస్ ఆధిపత్య పోరులో భాగంగా ఎల్‌జేపీ చీలిపోయింది. హరియాణాలోని ప్రస్తుత పార్టీలైన ఇండియన్ నేషనల్ లోక్ దళ్ (ఐఎన్‌ఎల్‌డీ), రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆర్‌ఎల్‌డీ)విషయంలో కూడా భిన్నమైనదేమీ లేదు. జనతాదళ్ చీలికలకు కులం ఎప్పుడూ పెద్ద తలనొప్పే. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు ఇచ్చిన కోటాతో పాటు ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించే మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలనే వీపీ సింగ్ నిర్ణయం... అగ్రవర్ణ హిందువులు అని పిలవబడే బీజేపీ కమండల రాజకీయాలను ఎదుర్కోవడమే. ఇది సమాజంలోని నిర్దిష్ట వర్గాలను లక్ష్యంగా చేసుకుని రాజకీయ నాయకులను సృష్టించింది. ఆర్‌జేడీ, సమాజ్‌వాదీ పార్టీలు యాదవులు, ముస్లింలపై దృష్టి సారించాయి. అయితే జేడీ(యూ) ఓటు బ్యాంకు చెల్లాచెదురైనప్పటికీ దళితులలో పేదలపై స్పష్టమైన దృష్టి ఉంది. జాట్ ఓట్లపై ఐఎన్‌ఎల్‌డీ దృష్టి సారించింది. ఈ క్రమంలో ఆ పార్టీలు సోషలిస్టు ఆశయాలను మరిచిపోయాయి.

ఏకీకరణ కలేనా?

నేడు జైప్రకాశ్ నారాయణ్ వంటి మార్గదర్శక శక్తి లేదా వీపీ సింగ్ వంటి రాజకీయ నాయకుడు లేరు. జనతాదళ్ చీలికలు చాలాకాలం క్రితం కాంగ్రెస్, బీజేపీకి సైద్ధాంతిక పునాదిని ఇచ్చాయి. ఇప్పుడు ప్రజాకర్షక రాజకీయాల వల్ల ఆప్ సరికొత్త లబ్ధి పొందుతోంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో నరేంద్ర మోదీ మళ్లీ అధికారం కోసం తహతహలాడుతున్న తరుణంలో జనతా నుంచి చీలిన పార్టీల ఏకీకరణ అత్యంత కష్టసాధ్యమైన విషయమే.

జేడీ(ఎస్), ఎల్‌జేపీ, బీజేడీ, జేడీ(యూ)

1999లో ఒకప్పుడు జనతాదళ్‌లో భాగమైన మాజీ ప్రధాని దేవెగౌడ జనతాదళ్ (సెక్యులర్) ని స్థాపించారు. రామ్ విలాస్ పాశ్వాన్ 2000లో లోక్ జనశక్తి పార్టీని స్థాపించారు. ఒడిశాలో బిజూ పట్నాయక్ అప్పటికే బిజూ జనతా దళ్ (బీజేడీ)ని సృష్టించారు. శరద్ యాదవ్‌కు జనతాదళ్ ఉంది. కానీ చాలామంది నాయకులు అందులో లేకుండా పోయారు. దీంతో ఆయన దానిని జనతాదళ్-యునైటెడ్ (జేడీయూ)గా మార్చారు. 2003లో సమతా పార్టీ లాలూ-రబ్రీ పాలనను అంతం చేసేందుకు జేడీ(యూ)లో విలీనమైంది. 2007లో ఉపేంద్ర కుశ్వాహా ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌ను ఒక కోటరీ చుట్టుముట్టారని, పార్టీ ఆశయానికి కట్టుబడి ఉన్న వారి మాట వినడం లేదని ఆరోపించడంతో జేడీ(యూ) నుంచి బహిష్కరణకు గురయ్యారు. కుశ్వాహా సొంతంగా రాష్ట్రీయ సమతా పార్టీని స్థాపించారు. ఇది పూర్వపు సమతా పార్టీ నుంచి వచ్చింది.

జేడీయూకు కుశ్వాహా గుడ్‌బై

పాట్నా: బీహార్ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. కొద్దికాలంగా జేడీయూ పనితీరుపై అసంతృప్తితో ఉన్న ఆ పార్టీ సీనియర్ నేత ఉపేంద్ర కుశ్వాహా జేడీయూకు సోమవారం రాజీనామా చేశారు. 'రాష్ట్రీయ లోక్ జనతా దళ్' అనే కొత్త పార్టీని స్థాపించనున్నట్టు ఆయన ప్రకటించారు. నేటి నుంచి కొత్త రాజకీయ ఇన్నింగ్స్ ప్రారంభిస్తున్నానని, కొద్ది మంది మినహా జేడీయూలో ప్రతి ఒక్కరూ ఆందోళనగానే ఉన్నారని కుశ్వాహా చెప్పారు. ఎన్నికైన తన సహచర మిత్రులతో సంప్రదించి, రాజీనామా నిర్ణయం తీసుకున్నానన్నారు. మొదట్లో నితీశ్ చాలా మంచిగా ఉండేవారని, చివరికి వచ్చే సరికి ఆయన ఎంచుకున్న మార్గం ఆయనకే కాకుండా బీహార్‌కు కూడా చేటు చేయనుందని మీడియా సమావేశంలో మాట్లాడుతూ కుశ్వాహ చెప్పారు. కొత్తగా రాష్ట్రీయ లోక్ జనతాదళ్ పార్టీని ఏర్పాటు చేయాలని తాము నిర్ణయించినట్టు కుశ్వాహ తెలిపారు. ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. పార్టీకి తాను జాతీయ అధ్యక్షుడిగా ఉంటానని, కర్పూరి ఠాకూర్ వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్తామని చెప్పారు. కాగా, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు, ఉపేంద్ర కుశ్వాహాకు మధ్య ఇటీవల కాలంలో అభిప్రాయ భేదాలు పొడచూపాయి. 2021 మార్చిలో ఉపేంద్ర కుశ్వాహా తన సొంత పార్టీ అయిన రాష్ట్రీయ లోక్ సమతా పార్టీ (ఆర్‌ఎల్‌ఎస్‌పీ)ని జేడీయూలో విలీనం చేశారు. అయితే, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్‌కు తనమంత్రివర్గంలో ఉప ముఖ్యమంత్రి పదవిని నితీశ్ కట్టబెట్టినప్పటి నుంచి కుశ్వాహా వర్గీయుల్లో అసంతృప్తి నెలకొంది. నితీశ్ తనను నిర్లక్ష్యం చేశారనే అభిప్రాయంతో కుశ్వాహా ఉన్నారు. ఇటీవల దిల్లీలో వైద్యపరీక్షలకు వెళ్లిన కుశ్వాహా కొందరు బీజేపీ నేతలతో ఉన్న ఫోటో బయటకు వచ్చింది. ఇది కుశ్వాహా ఆదేశాలతో ఆయన వర్గీయులు చేసిన పనేనని నితీశ్ అనుమానించడంతో విభేదాలు మరింత ముదిరాయి.

రోడ్డెక్కిన ఇద్దరు మహిళా అధికారులు

పరస్పర వ్యక్తిగత విమర్శలు... ప్రభుత్వం ఆగ్రహం

బెంగళూరు: కన్నడనాట ఇద్దరు ఉన్నతాధికారిణులు పరస్పరం చేసుకుంటున్న విమర్శలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఇది బసవరాజ్ బొమ్మై ప్రభుత్వాన్ని తీవ్ర ఆగ్రహానికి గురిచేసింది. వారిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధమైంది. వివరాల్లోకి వెళితే...ఆదివారం ఐఏఎస్ అధికారిణి రోహిణీ సింధూరికి చెందిన వ్యక్తిగత ఫొటోలను ఐపీఎస్ అధికారిణి డి.రూపా ముద్గిల్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ ఫొటోలనే గతంలో రోహిణి పురుష ఐఏఎస్ అధికారులకు షేర్ చేశారని రూపా ఆరోపించారు. ఈ ప్రవర్తనతో వృత్తిపరమైన నియమాలను ఉల్లంఘించారని మండిపడ్డారు. 2021 నుంచి 2022 మధ్య ఈ చిత్రాలను ముగ్గురు పురుష ఐఏఎస్ అధికారులకు షేర్ చేసినట్లు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అలాగే అవినీతి ఆరోపణలూ చేశారు. దీనిపై తాను ముఖ్యమంత్రి బొమ్మై, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వందిత శర్మకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ ఆరోపణలపై రోహిణి సైతం అంతే ఘాటుగా స్పందించారు. రూప తనపై వ్యక్తిగత దూషణకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన పరువుకు భంగం కలిగించేందుకు ఆమె తన సోషల్ మీడియా, వాట్సాప్ స్టేటస్ స్క్రీన్‌షాట్లను సేకరించారని, తాను వీటిని కొందరికి పంపినట్లు ఆమె అంటున్నారని మండిపడ్డారు. ఆ వ్యక్తులెవరో చెప్పాలని కోరుతున్నానన్నారు. మానసిక అనారోగ్యం అనేది పెద్ద సమస్య. వైద్యుల సహకారంతో దానిని తగ్గించాల్సిన అవసరం ఉంది. బాధ్యాయుత స్థానంలో ఉన్నవారు ఆ అనారోగ్యం పాలైతే.. అది మరింత ప్రమాదకరమని మండిపడ్డారు. అలాగే ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఇద్దరు అధికారిణులు ఇలా బహిరంగంగా విమర్శలకు దిగడంపై కర్ణాటక ప్రభుత్వం ఆగ్రహం వెలిబుచ్చింది. 'వారి ప్రవర్తనపై చర్యలు తీసుకుంటాం. ఇద్దరు సామాన్య వ్యక్తులు కూడా బహిరంగంగా ఇలా విమర్శించుకోరు. వారికి వ్యక్తిగతంగా ఎలాంటి విరోధం ఉన్నా.. మీడియా ముందు ఇలా ప్రవర్తించడం సరికాదు' అని కర్ణాటక హోంమంత్రి వెల్లడించారు. ఈ వ్యవహారంపై సీఎం, డీజీపీతో చర్చించినట్లు చెప్పారు. ప్రస్తుతం రూప.. కర్ణాటక హస్త కళల అభివృద్ధి సంస్థకు మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్‌గా సింధూరి విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో జనతాదళ్ సెక్యులర్ ఎమ్మెల్యే మహేశ్‌తో ఒక రెస్టారెంట్‌లో సింధూరి దిగిన చిత్రం వైరల్ అయింది. ఒక ఐఏఎస్ అధికారిణికి రాజకీయ నాయకుడిని కలవాల్సిన అవసరం ఏముందని ఆ సమయంలో రూప ప్రశ్నించారు. ఇది ఇద్దరి మధ్య విభేదాలకు దారితీసింది. ఇదిలా ఉంటే.. ప్రస్తుత ఘర్షణతో పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు సింధూరి భర్త వెల్లడించారు.

వారొచ్చేది ఓట్లు దండుకునేందుకే...

- ఆ తర్వాత మోదీ... ఒవైసీ కనిపించరు
- కాంగ్రెస్ నాయకుడు సచిన్ పైలట్

జైపూర్: ఎన్నికల సంవత్సరంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ తరచూ రాష్ట్రానికి వస్తున్నారని, అది కేవలం ఓట్లు రాబట్టుకోవడం కోసమేనని, ఒక్కసారి లక్ష్యం నెరవేరితే, వారు కనిపించకుండా పోతారని రాజస్థాన్ మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్ సోమవారం అన్నారు. శ్రీగంగానగర్ జిల్లాలో జరిగిన ఒక బహిరంగ కార్యక్రమంలో పైలట్ మాట్లాడుతూ రాజస్థాన్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ బలంగా ఉన్న ప్రాంతాలను సందర్శించాలనే ఉద్దేశంతో దిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్‌వేలోని దిల్లీ-దౌసా-లాల్సోట్ భాగాన్ని ప్రారంభించేందుకు మోదీ దౌసాను ఎంచుకున్నారని చెప్పారు. ప్రధాన మంత్రి ఎక్స్‌ప్రెస్ వేను ప్రారంభించారు. ఫిబ్రవరి 12న దౌసాలో బహిరంగ సభ నిర్వహించారు. పైలట్ 2004 నుంచి 2009 వరకు పార్లమెంటులో దౌసా లోక్‌సభ స్థానానికి ప్రాతినిధ్యం వహించారు. చత్తీస్‌గఢ్‌లోని కాంగ్రెస్ నేతలకు సంబంధించిన ప్రాంగణాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాడులను కూడా పైలట్ తప్పుపట్టారు. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ ఫిబ్రవరి 24 నుంచి మూడు రోజుల ప్లీనరీ సమావేశాన్ని నిర్వహించబోతోంది. దీనిని దేశం మొత్తం గమనిస్తోందని ఆయన అన్నారు. మోదీ, ఆల్ ఇండియా మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) ఒవైసీని ఆయన విమర్శిస్తూ, 'ఈ ఫిబ్రవరి ప్రత్యేకమైనది. ప్రధాని దౌసాకు వెళుతున్నారు. ఒవైసీ టోంక్‌కు వెళుతున్నారు. ఎందుకంటే ఇది ఎన్నికల సంవత్సరం. గత నాలుగేళ్లుగా ఈ ఇద్దరు నేతలు ఎక్కడ ఉన్నారు? ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ ప్రసంగాలు, మతం గురించి మాట్లాడేందుకు వస్తున్నారు. వారు ఎన్నికలకు ముందు అక్కడ లేరు. రాజస్థాన్‌లో ఎన్నికలు ముగిసిన రోజు వారు అదృశ్యమవుతారు' అని తెలిపారు. 'ఇక్కడ కూర్చున్న మేం సుఖ దుఃఖాల్లో మీకు తోడుగా ఉన్నాం. రైతులకు వ్యతిరేకంగా చట్టాలు తెచ్చిన వారు, మతం పేరుతో ఓట్లు సంపాదించి అధికారంలోకి వచ్చారు. వారు అధికారంలో ఉన్నారు. కానీ వారు ద్రవ్యోల్బణం, నిరుద్యోగాన్ని నియంత్రించలేకపోయారు' అని టోంక్ నుంచి ఎమ్మెల్యే పైలట్ తెలిపారు. కేంద్రంలో అవకాశవాదులు పాలిస్తున్నారని, వారు దేశాన్ని అన్ని రంగాల్లో విఫలం చేశారని అన్నారు. 'ఎన్నికల సమయంలో మరోసారి హిందూ-ముస్లిం, మందిరం-మసీదు, భారత్-పాకిస్తాన్ అంటారు. కానీ వారికి ఎరువులు, విత్తనాలు, విద్యుత్, ఉపాధి, ఆరోగ్యంతో సంబంధం లేదు. ఎన్నికల ముందు ప్రసంగాలు చేసేందుకు వస్తారు' అని అన్నారు. తూర్పు రాజస్థాన్ కెనాల్ ప్రాజెక్ట్ (ఈఆర్‌సీపీ) పై ప్రధానిని ఉద్దేశించి పైలట్ మాట్లాడుతూ 2018లో రాష్ట్రంలో జరిగిన ఎన్నికల ర్యాలీల్లో మోదీ దానికి జాతీయ ప్రాజెక్టు హోదా కల్పిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. 'ఐదేళ్ల క్రితం తాను చేసిన వాగ్దానాన్ని ఆయన గుర్తు చేసుకోలేదు. దిల్లీ నుంచి ముంబైకి వెళ్లే రహదారి అయితే ప్రారంభోత్సవానికి దౌసా మాత్రమే వచ్చింది. మా (కాంగ్రెస్) కంచుకోటగా ఉన్న ప్రాంతాలను సందర్శించాలని ఆయనకు తెలుసు' అని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ ఎలాంటి అణచివేతనైనా పూర్తి స్థాయిలో ప్రతిఘటించాలని అన్నారు.

మోదీ సభకు అనుమతి నిరాకరణ

సౌత్ తురా (మేఘాలయ): ప్రధానమంత్రి నరేంద్రమోదీ ర్యాలీకి మేఘాలయలో చుక్కెదురైంది. మేఘాలయలోని స్టేడియంలో మోదీ ర్యాలీకి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుమతి నిరాకరించిన వ్యవహారం సంచలనంగా మారింది. ముఖ్యమంత్రి కన్రాడ్ కె సంగ్మా సొంత నియోజకవర్గం సౌత్ తురాలోని పీఏ సంగ్మా స్టేడియంలో మోదీ ఎన్నికల ర్యాలీ నిర్వహించేందుకు బీజేపీకి మేఘాలయ క్రీడా విభాగం అనుమతి నిరాకరించింది. ఫిబ్రవరి 24న షిల్లాంగ్, తురాలో మోదీ ఎన్నికల ప్రచారం నిర్వహించాల్సి ఉంది. స్టేడియంలో ఇంత పెద్ద సమావేశం నిర్వహించడం సరికాదని మేఘాలయ క్రీడా విభాగం పేర్కొంది. స్టేడియంలో నిర్మాణ పనులు ఇంకా కొనసాగుతున్నందున అక్కడ ఉన్న మెటీరియల్ భద్రత కోసం సభకు అనుమతించడం లేదని వివరించింది. ప్రత్యామ్నాయ వేదికగా అలోట్‌గ్రే క్రికెట్ స్టేడియంలో సభ అనుమతిపై పరిశీలిస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి స్వప్నిల్ టెంబే తెలిపారు. 127 కోట్లతో నిర్మించిన ఈ స్టేడియాన్ని గతేడాది డిసెంబర్ 16న ముఖ్యమంత్రి ప్రారంభించారు. స్టేడియం ప్రారంభోత్సవం జరిగిన రెండు నెలల తర్వాత ప్రధానమంత్రి ర్యాలీకి స్టేడియం అసంపూర్తిగా ఉందని, అందుబాటులో లేదని ఎలా ప్రకటించగలరని బీజేపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. కన్రాడ్ సంగ్మా, ముకుల్ సంగ్మా తమను చూసి భయపడుతున్నారని, మేఘాలయలో బీజేపీ బలాన్ని తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రితురాజ్ సిన్హా అన్నారు. ప్రధానమంత్రి ర్యాలీని ఆపడానికి ప్రయత్నించవచ్చు కానీ రాష్ట్ర ప్రజలు బీజేపీకి మద్దతు ఇవ్వడానికి నిర్ణయించుకున్నారని సిన్హా అన్నారు.

కాంగ్రెస్ నేతల ఇళ్లలో ఈడీ సోదాలు

న్యూఢిల్లీ: ఛత్తీస్‌గఢ్ బొగ్గు లెవీ కుంభకోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)అధికారులు సోమవారం ఉదయం 14 ప్రాంతాల్లో సోదాలు జరిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు, కాంగ్రెస్ పార్టీ కోశాధికారి ఇళ్లు, కార్యాలయాలపై ఈడీ అధికారులు దాడులు చేశారు. ఈడీ దాడులు చేసిన వారందరూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేష్ బాగెల్ సన్నిహితులుగా భావిస్తున్నారు. కోల్ లెవీ స్కాంలో కొందరు రాజకీయ నేతలు, అధికారులు 540 కోట్ల రూపాయల కుంభకోణానికి పాల్పడ్డారని ఈడీ ఆరోపించింది. ఈడీ దాడుల నేపథ్యంలో సీఎం భూపేష్ బాగెల్ సోమవారం విలేకరుల సమావేశంలో మోదీ సర్కారుపై మండిపడ్డారు. 'భారత్ జోడో యాత్ర విజయవంతమై అదానీకి సంబంధించిన నిజానిజాలు బట్టబయలు కావటంతో బీజేపీ నిరుత్సాహానికి గురైంది. ఈడీ దాడులు ప్రజల దృష్టి మరల్చే ప్రయత్నం. దేశానికి నిజం తెలుసు. పోరాడి గెలుస్తాం'అని సీఎం బాగెల్ చేశారు. గత ఏడాది అక్టోబరులో ఈడీ జరిపిన దాడుల్లో రూ.4కోట్ల నగదు, ముఖ్యమైన కీలక పత్రాలు దొరికాయి.

దారుణంగా పడిపోయిన అదానీ ఆస్తి విలువ

న్యూఢిల్లీ: హిండెన్‌బర్గ్ నివేదిక ప్రభావం పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీపై తీవ్ర ప్రభావం చూపించింది. ఆయన నికర ఆస్తి విలువ సగానికి పైగా క్షీణించింది. బ్లూమ్‌బర్గ్ ఇండెక్స్ ప్రకారం ప్రస్తుతం అదానీ ఆస్తి విలువ 50 బిలియన్ డాలర్ల దిగువకు పడిపోయింది. ప్రస్తుతం ఆయన మొత్తం సంపద విలువ 49.1 బిలియన్ డాలర్లుగా ఉంది. నెల రోజుల క్రితం 60 ఏళ్ల అదానీ 120 బిలియన్ డాలర్ల సంపదతో ప్రపంచ కుబేరుల్లో మూడో స్థానంలో నిలిచారు. బ్లూమ్‌బర్గ్ నివేదిక వెలుగు చూసి ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలు రేకెత్తించిన తర్వాత ఆయన నెట్‌వర్త్ క్రమంగా కరుగుతూ వచ్చింది. ఇప్పుడు సగానికి పైగా క్షీణించి 50 బిలియన్ డాలర్ల దిగువకు పడిపోయింది. హిండెన్‌బర్గ్ నివేదిక విడుదలయ్యాక స్టాక్ మార్కెట్లో ఒక్కసారిగా ప్రకంపనలు చెలరేగాయి. అదానీ గ్రూప్ లిస్టెడ్ కంపెనీల విలువను దారుణంగా దెబ్బతీసింది. అదానీకి చెందిన ఏడు ప్రధాన కంపెనీలు మొత్తంగా 120 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువను కోల్పోయాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలు రేపిన హిండెన్‌బర్గ్ నివేదిక కుట్రపూరితమని, పూర్తి అవాస్తవాలతో నివేదికను తయారుచేశారని అదానీ గ్రూప్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ నివేదికను అదానీ గ్రూప్ తిప్పికొట్టినప్పటికీ పెట్టుబడిదారుల్లో భయాల కారణంగా లిస్టెడ్ కంపెనీల షేర్ల విలువ క్రమంగా దిగజారుతూ వచ్చింది. ఈ నివేదిక అదానీ వ్యక్తిగత సంపదపైనా తీవ్ర ప్రభావం చూపింది. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఆయన సంపద 71 బిలియన్ డాలర్లు పడిపోయింది.

ఈసీని రద్దు చేయాలి

- పార్టీ, గుర్తు సరే... మా పేరు దోచుకోలేరుగా
- ఉద్ధవ్ ఠాక్రే నిప్పులు

ముంబై: మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం ఏక్‌నాథ్ శిందే వర్గాన్నే అసలైన శివసేనగా గుర్తిస్తూ పార్టీ పేరు, ఎన్నికల గుర్తును వారికి కేటాయించిన ఈసీ తీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. శివసేన సస్పెండ్ చేసిన ఎమ్మెల్యేల వ్యవహారం సుప్రీంకోర్టులో ఉన్నందున పార్టీ పేరు, గుర్తు కేటాయింపుపై ఇప్పుడే నిర్ణయం తీసుకోవద్దని గతంలోనే కేంద్ర ఎన్నికల సంఘాన్ని అభ్యర్థించిన విషయాన్ని ఉద్ధవ్ గుర్తు చేశారు. తమ నుంచి అన్నీ దోచుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. పార్టీ పేరు, ఎన్నికల గుర్తు లాక్కున్నారు గానీ.. ఠాక్రే పేరును దోచుకోలేరన్నారు. ఎన్నికల సంఘాన్ని రద్దు చేయాలని ఉద్ధవ్ డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషనర్లను సైతం ప్రజలే ఎన్నుకోవాలన్నారు. అంత త్వరగా నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఈసీకి ఏమొచ్చిందని ప్రశ్నించారు. ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయంపై సుప్రీంకోర్టును ఆశ్రయించామని.. మంగళవారం విచారణ జరుగుతుందని తెలిపారు. సుప్రీం కోర్టే తమకు చివరి ఆశాకిరణమన్నారు. రాజ్యాంగబద్ధమైన సంస్థల సాయంతో ప్రజాస్వామ్యాన్ని బీజేపీ నాశనం చేస్తోందని నిప్పులు చెరిగారు. శివసేనను అంతమొందించాలన్న బీజేపీ కుట్రలో భాగంగానే తమ నుంచి పార్టీ పేరు, గుర్తు లాక్కొన్నారన్నారు. ఈరోజు తమకు జరిగినట్టే రేపు ఇంకే పార్టీలకైనా జరగొచ్చని.. ఇదే పరిస్థితి కొనసాగితే.. 2024 తర్వాత దేశంలో ప్రజాస్వామ్యం గానీ, ఎన్నికలు గానీ ఉండవని ఘాటుగా వ్యాఖ్యానించారు.

ఈసీ నిర్ణయంపై సుప్రీంకు ఉద్ధవ్ వర్గం

మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే వర్గాన్ని నిజమైన శివసేనగా గుర్తించడం, 'విల్లు-బాణం' గుర్తును ఆ వర్గానికి కేటాయిస్తూ కేంద్ర ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఉద్ధవ్ ఠాక్రే వర్గం సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ కేసును షెడ్యూల్ లేకుండా అత్యవసర విచారణ చేపట్టాలని ఠాక్రే వర్గం తరపు న్యాయవాది కోరారు. ఇందుకు సీజేఐ డీవై చంద్రచూడ్ నిరాకరించారు. మంగళవారం అత్యవసర జాబితాలో ప్రవేశపెట్టాలని రిజిస్ట్రీకి సూచించారు. గత ఏడాది జూన్‌లో ఏక్‌నాథ్ శిందేవర్గం అప్పటి మహా వికాశ్ అఘాడి ప్రభుత్వంపై తిరుగుబాటు బావుటా ఎగురవేసింది. శివసేనలోని 55 మంది ఎమ్మెల్యేలలో 40 మందిని, 18 మంది ఎంపీల్లో 13 మందిని శిందే తన వైపు తిప్పుకున్నారు. దీంతో ఉద్ధవ్ ఠాక్రే సారథ్యంలోని మహా వికాస్ అఘాడి ప్రభుత్వం కుప్పకూలింది. ఆ వెంటనే బీజేపీతో శిందే పొత్తుపెట్టుకుని మహారాష్ట్రలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఏక్‌నాథ్ శిందే ముఖ్యమంత్రిగా, దేవేంద్ర ఫడ్నవిస్ ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. అనంతరం పార్టీ గుర్తు, పేరు తమకే చెందాలంటూ ఉద్ధవ్, శిందే వర్గం ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించాయి. దాదాపు ఎనిమిది నెలల నాటకానికి కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం తెరదించింది. శిందేకు 2019 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన ఎక్కువ మంది శివసేన ఎమ్మెల్యేల మద్దతు ఉందని, ఇది పార్టీ సాధించిన ఓట్లలో 76 శాతమని తెలిపింది. 23.5 శాతం మందే ఉద్ధవ్ వైపు ఉన్నట్టు 78 పేజీల ఆదేశాల్లో ఈసీ స్పష్టం చేసింది. ఈసీ నిర్ణయంతో ఉద్ధవ్ శివసేనకు గట్టి ఎదురుదెబ్బ తగలింది. 1966లో బాలాసాహెబ్ ఠాక్రే స్థాపించిన పార్టీపై ఠాక్రే కుటుంబం పట్టు కోల్పోయినట్టు అయింది.

అంతా రాజ్యాంగ బద్ధమే: కోశ్యారీ



శివసేన ముక్కలు కావడం, మహారాష్ట్రలో తలెత్తిన రాజకీయ సంక్షోభంపై మాజీ గవర్నర్ భగత్ సింగ్ కోశ్యారీ స్పందించారు. తాను గవర్నర్‌గా ఉన్న సమయంలోనే మహారాష్ట్రలో ఇవి జరగడంపై నోరు విప్పారు. కోశ్యారీ సోమవారం ఓ న్యూస్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. మహారాష్ట్రలో అంతా రాజ్యాంగం ప్రకారమే జరిగిందని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లోనూ ప్రభుత్వాలు మారాయని గుర్తు చేశారు. బీజేపీ-శిందే కూటమికి మద్దతుగా నిలిచారన్న ఆరోపణలపై కోశ్యారీ స్పందించారు. నాటి సీఎం ఉద్ధవ్ ఠాక్రే వద్ద మెజారిటీ ఉండి ఉంటే.. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తానని తన దగ్గరికి రావాల్సిందన్నారు. కానీ ఆయన వెనకడుగు వేశారని, ఏమీ మాట్లాడలేదని, దీంతో మరో పార్టీ వచ్చి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పిందని, అది రాజ్యాంగం ప్రకారమే జరిగిందని వివరించారు. 'పెళ్లి కొడుకు ఎక్కడ అని నేను అడిగాను. కానీ పెళ్లికొడుకు లేకుండానే పెళ్లి చేసుకోవాలని వాళ్లు అనుకున్నారు. అదెలా సాధ్యమని ప్రఫుల్ పటేల్, శరద్ పవార్, ఛగన్ భుజ్‌బల్ (ఎన్సీపీ నేతలు)ను అడిగాను. అయినా ఒక్కరు కూడా.. ప్రభుత్వ ఏర్పాటుకు మెజారిటీ ఉందని లేఖ ఇవ్వలేదు. శివ సైనికుడిని సీఎం చేయాలని అనుకుంటున్నామని మాత్రమే చెప్పారని కోశ్యారీ వివరించారు.

నిర్లక్ష్యం నీడన ఆఫ్‌షోర్

- శ్రీకాకుళం జిల్లాలో శంకుస్థాపన చేసి 15 ఏళ్లు
- నిధులు లేక నిలిచిపోయిన పనులు
- సాగు, తాగునీటి కోసం రైతులు, ప్రజల ఎదురుచూపులు
- న్యాయం జరగలేదంటున్న నిర్వాసితులు
- నేడు సీపీఐ బృందం పర్యటన

విశాలాంధ్ర-పలాస : శ్రీకాకుళం జిల్లాలో ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్మాణ పనులకు గ్రహణం వీడటం లేదు. శంకుస్థాపన జరిగే 15 ఏళ్లు కావస్తున్నా నిధులు లేక పనులు నిలిచిపోయాయి. సాగు, తాగు నీటి కోసం రైతులు, ప్రజలు ఎదురుచూపులు చూస్తున్నారు. ఇక నిర్వాసితులు సైతం తమకు న్యాయం జరగలేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2008 ఏప్రిల్ 4న పలాస మండలం రేగులపాడు వద్ద జరిగిన బహిరంగ సభలో నాటి ముఖ్యమంత్రి దివంగత నేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి ప్రసంగిస్తూ, మరో ఏడాదిలో ఈ రిజర్వాయర్ నీటితో ఈ ప్రాంతం పచ్చదనంతో కళకళలాడుతుందని, నాలుగు మండలాలకు చెందిన రైతులు ఏడాదిలో రెండు పంటలు పండించుకోవచ్చని, నేటి నుంచి రిజర్వాయర్ పనులు నిరంతరం కొనసాగుతాయని చెప్పారు. అయితే ఇది జరిగి 15 సంవత్సరాలు కావస్తున్నా రిజర్వాయర్ పనులు ముందుకు సాగలేదు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని పలాస మాజీ ఎమ్మెల్యే గౌతు శివాజీ గడ్డం దీక్ష చేపట్టి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి సమస్యను తీసుకువెళ్లి రూ.475 కోట్లు మంజూరు చేయించారు. అయినా పనులు నత్తనడకనే సాగాయి. 2018 జులై నాటికి ఆఫ్‌షోర్ నిర్మాణ పనులు పూర్తి చేసి 10 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని అప్పటి జిల్లా కలెక్టర్, ప్రస్తుతం ముఖ్యమంత్రి కార్యాలయం అదనపు కార్యదర్శిగా ఉన్న ధనుంజయరెడ్డి ప్రకటించినా నేటికీ కార్యరూపం దాల్చలేదు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడి మూడున్నరేళ్లు కావస్తున్నా రిజర్వాయర్ పనులకు గ్రహణం వీడలేదు సరికదా నత్తనడకగా నడుస్తున్న పనులు కూడా నిలిచిపోయాయి. రిజర్వాయర్‌కు వాడుతున్న వాహనాలు, పనిముట్లు తుప్పు పట్టిపోయాయి. కాగా రాష్ట్ర మత్స్య, పశుసంవర్థక శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కృషి ఫలితంగా ఆఫ్‌షోర్ నిర్మాణానికి సీఎం జగన్ రూ.828 కోట్లు మంజూరు చేశారని, పనుల టెండర్లను సాయికృష్ణ ఎంటర్ ప్రైజస్‌కు అప్పగించారని, త్వరలో పనులు ప్రారంభిస్తామని ఆయన ఇటీవల ప్రకటించారు.

ఆఫ్‌షోర్ రిజర్వాయర్ ఏమిటంటే...

పలాస, వజ్రపుకొత్తూరు, నందిగాం, మెళియాపుట్టి మండలాల రైతులకు, అలాగే పలాస, కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన ప్రజలకు సాగు, తాగు నీరు అందించేందుకు జలయజ్ఞం పథకంలో భాగంగా రూ.127 కోట్లతో ఆఫ్‌షోర్ నిర్మాణం చేపట్టేందుకు పలాస మండలం రేగులపాడు వద్ద 15 సంవత్సరాల క్రితం నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేశారు. అయితే ఆయన హఠాన్మరణంతో రైతుల ఆశలు ఆవిరయ్యాయి. ఆ తర్వాత ముఖ్యమంత్రులుగా బాధ్యతలు చేపట్టిన రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి అప్పటి జిల్లా పర్యటనలో రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేస్తామని ఇచ్చిన హామీలు గాలిలో కలిసిపోయాయి. ఇక పాదయాత్ర సమయంలో ఆఫ్‌షోర్‌ను పూర్తి చేస్తామని హామీ ఇచ్చిన వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా పదవి చేపట్టి మూడున్నరేళ్లు అవుతున్నా రిజర్వాయర్ నిర్మాణంపై దృష్టి సారించలేదు. సుమారు 25,600 ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఈ రిజర్వాయర్ పనులకు ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో నిధులు కేటాయించకపోవడంతో పనులు నత్తనడకగా సాగాయి. ఇప్పటి వరకు సుమారు రూ.400 కోట్ల వరకు ఖర్చు చేశామని అధికారులు చెబుతున్నారు. ప్రాజెక్టుకు అవసరమైన భూములను రైతుల నుంచి సేకరించారు. అయితే ఇప్పటి వరకు తమకు సరైన న్యాయం జరగలేదని నిర్వాసితులు ఆరోపిస్తున్నారు. కొన్ని గ్రామాలు రిజర్వాయర్ గర్భంలో కలిసిపోయే పరిస్థితి ఉండటంతో వారికి పలాస, కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి కొసంగిపురం వద్ద ఇళ్లను నిర్మించారు. కానీ కొంత మంది ఇప్పటికీ గ్రామాలను విడిచి పెట్టలేదు. గతంలో నిర్మాణం చేపట్టిన ఇద్దరు కాంట్రాక్టర్లు నిధులు రాకపోవడంతో అర్థాంతరంగా పనులు ఆపి చేతులెత్తేశారు. మొత్తం ప్రాజెక్టుకు 2,476 ఎకరాల భూమి అవసరం ఉన్నప్పటికీ, 1,900 ఎకరాల భూమిని మాత్రమే రైతుల నుంచి సేకరించి ప్రస్తుతం మరో కంపెనీకి అప్పగించినా పనులు జరగలేదు.

ఇదీ ప్రాజెక్టు పరిస్థితి

మెళియాపుట్టి మండలం చాపర గ్రామం వద్ద మహేంద్రతనయ నదికి చేరే అదనపు వరద నీటిని ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌కు మళ్లిస్తారు. ఈ నీరు ఒడిశాలో డబారిసింగ్ కొండ నుంచి వస్తోంది. దీనిని 14 కిలోమీటర్ల పొడవున కాలువ ద్వారా రేగులపాడు వరకు తరలిస్తారు. రేగులపాడు వద్ద 1,764 ఎకరాల విస్తీర్ణంలో 1.76 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించాల్సి ఉంది. రిజర్వాయర్ కోసం సేకరించాల్సిన భూమిలో 554 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. గతంలో రైతుల వద్ద భూసేకరణ కోసం రూ.7.5 కోట్ల రూపాయలు కేటాయించారు. ఇప్పటికే రూ.6.5 కోట్లు చెల్లించినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం మెళియాపుట్టి మండలం జాడుపూడి, పలాస మండలం రేగులపాడు వద్ద అసంపూర్తిగా స్ట్రెంచర్లు నిర్మించి వదిలేశారు.

ముంపు గ్రామాలు

రిజర్వాయర్ నిర్మాణంతో రేగులపాడు, దాసుపురం, చీపురుపల్లి, శారదాపురం, చిన్నగురువూరు, బడగాం, పెద్దగురువూరు, సవరలింగపురం, మొగిలిపాడు, తూముకొండ, బంజీరు గ్రామాలు కొంత వరకు ముంపునకు గురవుతాయి. ఏదిఏమైనా రిజర్వాయర్ పూర్తిచేసే బాధ్యత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంపై ఉందని రైతులు అంటున్నారు. ఈ నేపథ్యంలో రైతుల సమస్యలను తెలుసుకునేందుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అధ్వర్యంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ బృందం ఆఫ్‌షోర్ రిజర్వాయర్ ప్రాంతాన్ని పరిశీలించేందుకు మంగళవారం వస్తుంది.

15 నుంచి తెలంగాణలో ఒంటిపూట బడులు

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణలో మార్చి 15 నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు విద్యాశాఖ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు క్లాసులు నిర్వహించనున్నారు. ఒంటిపూట బడి సమయాల్లో అన్ని పాఠశాలల్లో స్వచ్ఛమైన తాగునీరు అందేలా చూడాలని విద్యాశాఖ ఆదేశించింది. పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి 13 వరకు జరుగుతాయి. మిగిలిన తరగతులకు ఏప్రిల్ 12 నుంచి జరుగుతాయి. ఏప్రిల్ 23 నుంచి జూన్ 11వ తేదీ వరకు పాఠశాలలకు వేసవి సెలవులు ఇవ్వనున్నారు.

బద్రీనాథ్ రహదారిపై పగుళ్లు

డెహ్రాడూన్: ఛార్‌ధామ్ యాత్ర రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలుకానున్న తరుణంలో జోషిమఠ్ సమీపంలోని బద్రీనాథ్ జాతీయ రహదారిపై కొత్తగా పగుళ్లు కనిపించాయి. జోషిమఠ్, మార్వరి మధ్య 10 కిలోమీటర్ల మేర ఈ పగుళ్లు కనిపించినట్టు వార్తలు వచ్చాయి. ప్రధానంగా మార్వారి బ్రిడ్జి, రైల్వే గెస్ట్ హౌస్ సమీపంలోని ఎస్‌బీ బ్రాంచ్ ఎదుట పగుళ్లు విస్తరించినట్టు స్థానికులు తెలిపారు. పగుళ్లకు కారణాలు, భూమి కుంగిపోవడానికి-పగుళ్లకు ఏదైనా సంబంధం అందా అనే అంశంపై నిపుణులు సమగ్ర దర్యాప్తు జరపాల్సి ఉంటుందని సీనియర్ జియాలజిస్ట్ ఒకరు తెలిపారు. జిల్లా అధికారులు మాత్రం దీనిపై ఇంకా పెదవి విప్పనప్పటికీ, పగుళ్లకు కారణాలను నిపుణుల బృందం పరిశీలిస్తోందని, ఆందోళన చెందాల్సిన పని లేదని ఛమోలీ జిల్లా మేజిస్ట్రేట్ హిమాన్షు ఖురానా తెలిపారు. దీనికి ముందు కూడా జాతీయ రహదారిపై పగుళ్లు కనిపించడంతో సరిహద్దు రోడ్ల నిర్వహణా సంస్థ వాటిని సిమెంట్‌తో మరమ్మతు చేసింది. మరోవైపు, బహుగుణ నగర్, సుభాష్ నగర్, కన్యాప్రయాక్ అప్పర్ బజార్ ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటంతో ప్రజలను జిల్లా యంత్రాంగం అప్రమత్తం చేసింది. బాధిత ప్రాంతాల్లో ఛమోలీ జిల్లా మేజిస్ట్రేట్ హిమాన్షు ఖురానా పర్యటించారు. బాధితులను అన్నివిధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కొండచరియలు విరిగిపడి తీవ్రంగా పగుళ్లు వచ్చిన ఇళ్లలో ఉంటున్న కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్టు ఖురానా తెలిపారు.

ముగిసిన రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలు

విశాలాంధ్ర-ఉరవకొండ: రాష్ట్రస్థాయి అండర్-14, అండర్-17 బాల బాలికల సెపక్ తక్రా పోటీలు సోమవారం విజయవంతంగా ముగిశాయి. అనంతపురం జిల్లా ఉరవకొండలోని పోలీస్ క్రీడా మైదానంలో నిర్వహించిన ఈ పోటీలలో 13 జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. రెండు రోజులుగా ఈ పోటీలు పోటా పోటీగా జరిగాయి.అండర్ 14 బాలుర విభాగంలో ప్రథమ స్థానం కర్నూలు జిల్లా, రెండవ స్థానం నెల్లూరు, మూడో స్థానంలో పశ్చిమ గోదావరి జిల్లా జట్లు నిలిచాయి. అండర్ 14 బాలికల విభాగంలో ప్రథమ స్థానం పశ్చిమ గోదావరి జిల్లా జట్టు దక్కించుకోగా, రెండవ స్థానం అనంతపురం, మూడవ స్థానంలో కర్నూలు జిల్లా నిలిచింది. అండర్ 17 బాలుర విభాగంలో ప్రథమ స్థానం పశ్చిమ గోదావరి, రెండవ స్థానం అనంతపురం, మూడు స్థానాన్ని నెల్లూరు జిల్లా కైవసం చేసుకున్నాయి. బాలికల విభాగంలో మొదటి స్థానంలో అనంతపురం జిల్లా, రెండో స్థానంలో పశ్చిమ గోదావరి, మూడో స్థానాన్ని నెల్లూరు జిల్లా క్రీడాకారులు కైవసం చేసుకున్నారు. గెలుపొందిన క్రీడాకారులకు ఉరవకొండ సీఐ హరినాథ్ మెమొంటోలు బహుమతులను ప్రదానం చేశారు.

దిల్లీ మద్యం కుంభకోణం

తీహార్ జైలుకు మాగుంట రాఘవ

న్యూదిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం రేపిన దిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఒంగోలు వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కుమారుడు రాఘవకు రౌస్ అవెన్యూ కోర్టు జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. మనీలాండరింగ్ కేసులో అరెస్టు చేసిన రాఘవను ఈడీ 10 రోజుల కస్టడీకి తీసుకున్న విషయం తెలిసిందే. సోమవారంతో కస్టడీ గడువు ముగియడంతో రాఘవకు రౌస్ అవెన్యూ కోర్టు జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. మార్చి 4వ తేదీ వరకు జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉంటారు. కోర్టు ఆదేశాల మేరకు రాఘవను తీహార్ జైలుకు తరలించారు. సౌత్ గ్రూప్ తరపున చెల్లించిన రూ.100 కోట్ల ముడుపుల వ్యవహారంలో రాఘవ పాత్ర ఉందని, ఇప్పటికే ఈ కేసులో అరెస్ట్ అయిన నిందితులతో ఆయనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ఈడీ వాదనలు వినిపించింది. మాగుంట రాఘవకు తయారీ, హోల్‌సేల్ వ్యాపారం, 2 రిటైల్ జోన్స్ కూడా ఉన్నాయని విచారణ సందర్భంగా ఈడీ కోర్టుకు వివరించింది. రూ.వంద కోట్ల ముడుపుల్లో రాఘవ కీలకంగా వ్యవహరించారని కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. ఈ కేసులో ఇప్పటికే శరత్ చంద్రారెడ్డి, విజయ్‌నాయర్, అభిషేక్, సమీర్, అమిత్ అరోరా, బినోయ్ అరెస్టు అయ్యారని పేర్కొంది. శరత్‌రెడ్డితో రాఘవకు మంచి సంబంధాలు ఉన్నాయని తెలిపింది. ముడుపుల సమీకరణలో సమీర్ మహేంద్రు కీలకంగా వ్యవహరించారని పేర్కొంది. ఇండో స్పిరిట్ కంపెనీలో రాఘవకూ భాగస్వామ్యం ఉందని.. దీన్నుంచి ఆయనకు వాటా వెళ్తోందని పేర్కొంది.

ఉత్తరాఖండ్‌లో భారీ పెట్టుబడులు: ప్రధాని మోదీ

డెహ్రాడూన్: రాష్ట్ర యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే ధ్యేయంగా ఉత్తరాఖండ్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతున్నట్లు ప్రధాని నరేంద్రమోదీ వెల్లడించారు. దీనివల్ల గతంలో ఉపాధి ఉద్యోగాల కోసం ఈ ప్రాంతం నుంచి యువత తిరిగి ఇక్కడకు వస్తారని చెప్పారు. గతంలో సోమవారం ఇక్కడ జరిగిన రోజ్‌గార్ మేళాలో అసిస్టెంట్ టీచర్లకు నియామక పత్రాలను పంపిణీ చేసిన అనంతరం ఆయన ప్రసంగించారు. ఉపాధ్యాయులను గుణాత్మక మార్పుకు మాధ్యమంగా అభివర్ణించారు. నూతన విద్యావిధానం ప్రకారం రాష్ట్ర యువతను కొత్త శతాబ్దానికి సిద్ధం చేయాలన్నారు. రాష్ట్ర యువతకు వారి అర్హతలు, సామర్థ్యం, నైపుణ్యాలకు తగ్గట్లుగా ప్రతి ఒక్కరికీ ఉద్యోగం వచ్చే విధంగా కేంద్రం, రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రధాని చెప్పుకొచ్చారు.

తగిన మూల్యం తప్పదు: జయప్రద

మీరట్(ఉత్తరప్రదేశ్): సమాజ్‌వాదీ పార్టీ సీనియర్ నేత ఆజంఖాన్‌పై మాజీ ఎంపీ, బీజేపీ నేత జయప్రద విమర్శలు గుప్పించారు. ఆయన చేసిన పనులకు ఇప్పటికే తగిన శిక్ష పడిందని, తండ్రీకొడుకులు చేసిన పాపాలకు తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందని జయప్రద అన్నారు. మీరట్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న జయప్రద.. సమాజ్‌వాదీ పార్టీ సీనియర్ నేత ఆజంఖాన్ పని అయిపోయిందన్నారు. అనేక కేసుల్లో శిక్ష ఖరారు కావడంతో ఆజంఖాన్, ఆయన కుమారుడు ఇటీవల శాసనసభ సభ్యత్వాలను కోల్పోవడాన్ని జయప్రద ప్రస్తావించారు. 'రాజకీయాల్లో భిన్న పార్టీల మధ్య భిన్నాభిప్రాయాలు ఉండవచ్చు. కానీ, అధికార గర్వం ఉండకూడదు. మహిళలను గౌరవించాలి. పేదలకు, అణగారినవర్గాల వారికి న్యాయం చేయాలి.ఆజంఖాన్, ఆయన కుమారుడు అబ్దుల్లా ఆజంలకు మహిళలను గౌరవించడం తెలియదు. ఆజంఖాన్ చేసిన పనులకు ఇప్పుడు శిక్ష అనుభవిస్తున్నారని చెప్పారు. యూపీ రాజకీయాల్లో కీలక నేతలుగా ఉన్న ఆజం ఖాన్, జయప్రద మధ్య ఇదివరకు ఎన్నో వివాదాలు కొనసాగాయి. 2019 ఎన్నికల సమయంలో రామ్‌పూర్ నుంచి పోటీ చేసే క్రమంలో జయప్రదపై చేసిన అనుచిత వ్యాఖ్యలకుగాను ఆజంపై అప్పట్లో ఎఫ్ఐఆర్ నమోదయ్యింది. గతేదాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రామ్‌పూర్ సదర్ నుంచి ఆజం ఖాన్, స్వార్ స్థానం నుంచి ఆయన కుమారుడు అబ్దుల్లా ఆజం గెలుపొందిన విషయం విదితమే. కొన్ని కేసుల్లో ఆజంకు మూడేళ్లు, అబ్దుల్లాకు రెండేళ్ల శిక్ష పడటంతో తండ్రీకొడుకులిద్దరూ శాసనసభ సభ్యత్వాలు కోల్పోయారు.

తారకరత్నకు కన్నీటి వీడ్కోలు

విశాలాంధ్ర-హైదరాబాద్: సినీ నటుడు నందమూరి కుటుంబం వారసుడు తారకరత్న అంత్యక్రియలు సోమవారం సాయంత్రం మహాప్రస్థానంలో ముగిశాయి. కుమారుడికి అంతిమ సంస్కారాలను ఆయన తండ్రి మోహనకృష్ణ పూర్తి చేశారు. ఈ సందర్భంగా తారకరత్న పాడెను బాలకృష్ణ, నందమూరి సోదరులు మోశారు. తారకరత్న వెంటే వైకుంఠ రథంలో మహాప్రస్థానానికి వచ్చిన బాలకృష్ణ, చంద్రబాబునాయుడు చేరుకున్నారు. మహాప్రస్థానంలో అంత్యక్రియలకు చంద్రబాబునాయుడు, విజయసాయిరెడ్డి, లోకేశ్, జూనియర్ ఎన్టీఆర్, కళ్యాణ్ రామ్ తదితరులు హాజరయ్యారు. తారకరత్న అంతిమయాత్రలో తెలుగు రాష్ట్రాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా పాల్గొన్నారు.

అంతకుముందు ఉదయం ఆయన భౌతికదేహాన్ని అభిమానుల సందర్శనార్థం ఫిల్మ్ ఛాంబర్ లో ఉంచారు. కుటుంబసభ్యులు, అభిమానులు, సినీ, రాజకీయ ప్రముఖులు తారకరత్నకు కన్నీటి వీడ్కోలు పలికారు. ఫిలించాంబర్ నుంచి జూబ్లీహిల్స్ లోని మహాప్రస్థానం వరకు తారకరత్న అంతిమయాత్ర సాగింది.

ఎన్‌బీకే 108లో నటించాల్సి ఉంది... అంతలోనే...

నందమూరి తారకరత్న మరణంతో సినీ పరిశ్రమలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తారకరత్న లేడన్న విషయాన్ని కుటుంబసభ్యులతోపాటు చాలా మంది అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. కాగా బాబాయి బాలకృష్ణతో తారకరత్న ఓ సినిమా చేయాల్సి ఉండగా.. ఇలా ఆకస్మిక మరణంతో అది కార్యరూపం దాల్చలేదు. ఇదే నెలలో షూటింగ్ ప్రారంభం కావాల్సి ఉన్న ఎన్‌బీకే 108 లో తారకరత్న నటించాల్సి ఉంది. ఎన్‌బీకే 108లో తారకరత్నకు ఓ పాత్ర ఇవ్వాలని బాలయ్య అనుకున్నాడట. తారకరత్నకు నివాళి అర్పించిన అనంతరం డైరెక్టర్ అనిల్ రావిపూడి మీడియాతో మాట్లాడుతూ ఇదే విషయాన్ని చెప్పుకొచ్చాడు. తదుపరి ప్రాజెక్ట్‌లో తారక రత్న కోసం ఓ పాత్రను రెడీ చేయాలని బాలకృష్ణ తనకు సూచించినట్టు అనిల్ రావిపూడి చెప్పాడు. ఈ చిత్రం ముందుగా నిర్ణయించిన ప్రకారం ఫిబ్రవరిలో సెట్స్ పైకి వెళ్లాల్సి ఉంది. అయితే తారకరత్న ఆకస్మిక మరణంతో షూటింగ్ వాయిదా పడింది. ఒకవేళ ఎన్‌బీకే 108లో తారకరత్న నటించి ఉంటే కెరీర్‌లో చాలా ప్రత్యేకమైన సినిమాగా నిలిచిపోయేదనడంలో ఎలాంటి సందేహం లేదు. అంతేకాదు తారకరత్నకు గ్రాండ్ సెకండ్ ఇన్నింగ్స్ షురూ అయ్యేదని అంటున్నారు సినీ అభిమానులు. అయితే తారకరత్న హఠాత్తుగా ఇలా అందరినీ వదిలివెళ్లడంతో బాబాయి-అబ్బాయిని ఒకే ఫ్రేమ్‌లో చూడాలన్న అభిమానుల కళ నెలవేరకుండా పోయింది.

ఐపీఎల్ ఉత్తమ కెప్టెన్ రోహిత్

ముంబై: కొద్ది రోజుల్లో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)16వ సీజన్ మొదలుకానుంది. కాగా ఐపీఎల్ 15 సీజన్లు పూర్తయిన సందర్భంగా స్టార్‌స్పోర్ట్స్ ఛానెల్ తాజాగా ప్రత్యేక ప్రోగ్రాం నిర్వహించింది. ఈ సందర్భంగా ఈ లీగ్‌లో కేటగిరీల వారీగా ఉత్తమ ప్రదర్శన కనబరిచిన ఆటగాళ్లకు అవార్డులు ప్రకటించింది. భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ ఐపీఎల్‌లో ఉత్తమ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీని వెనక్కి నెట్టి అతను స్టార్‌స్పోర్ట్స్ అవార్డు అందుకున్నాడు. రోహిత్ సారథ్యంలో ముంబై ఇండియన్స్ నాలుగు సార్లు (2013, 2015, 2017, 2019) ఐపీఎల్ టైటిల్ గెలిచింది. మొత్తంగా ఆ జట్టు ఐదు సార్లు ఐపీఎల్ విజేతగా అవతరించింది. ఈ లీగ్‌లో విజయవంతమైన ఫ్రాంఛైజీగా ముంబై ఇండియన్స్ గుర్తింపు సాధించింది. ఇక ఉత్తమ బౌలర్‌గా ముంబై

ఉత్తమ బ్యాటర్ డివిలియర్స్, బౌలర్ బుమ్రా

ఇండియన్స్ ఫాస్ట్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా ఎంపికయ్యాడు.15 సీజన్లలో బుమ్రా 145 వికెట్లు పడగొట్టాడు. ఉత్తమ బ్యాటర్‌గా దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ ఏబీ డివిలియర్స్ ఎంపికయ్యాడు. ఈ స్టార్ బ్యాటర్ తన ఐపీఎల్ కెరీర్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ఢిల్లీ డేర్‌డెవిల్స్ జట్లకు ఆడాడు. 184 మ్యాచ్‌లు ఆడిన అతను 151.69 స్ట్రయిక్ రేటుతో 5,162 రన్స్ చేశాడు. మూడు సెంచరీలు, 40 అర్థ సెంచరీలు ఉన్నాయి. అత్యధిక స్కోర్ 133. ఇక రాయల్ ఛాలెంజర్స్ మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ ఇన్‌క్రెడిబుల్ బ్యాటింగ్ పర్ఫార్మెన్స్ అవార్డు అందుకున్నాడు. 2016 సీజన్‌లో కోహ్లీ రెచ్చిపోయి ఆడాడు. నాలుగు సెంచరీలు బాదిన అతను 973 పరుగులు చేశాడు. కోహ్లీ చెలరేగి ఆడడంతో ఆ ఏడాది ఆర్సీబీ ఫైనల్ చేరింది. ఒక సీజన్‌లో అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన చేసిన బౌలర్‌గా సనీల్ నరైన్ అవార్డు అందు కున్నాడు. కోల్‌కతా నైట్ రైడర్స్‌కు ఆడిన తొలి సీజన్‌లోనే నరైన్ అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేశాడు. 2012లో అతను 5.5 ఎకానమీతో 24 వికెట్లు తీశాడు. ఆ ఏడాది కేకేఆర్ ఐపీఎల్ ట్రోఫీ గెలవడంలో ఈ ఆల్‌రౌండర్ కీలక భూమిక వహించాడు.

స్వదేశానికి హేజిల్‌వుడ్

సిడ్నీ: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో మిగతా రెండు టెస్టులకు కూడా ఆస్ట్రేలియా స్టార్ పేసర్ హేజిల్‌వుడ్ దూరం కానున్నాడు. గాయం నుంచి అతను ఇంకా కోలుకోనందున స్వదేశానికి తిరిగి వెళ్లనున్నాడు. అతనితో పాటు డేవిడ్ వార్నర్, అష్టన్ అగర్, మ్యాట్ రెన్‌షా కూడా బయలుదేరనున్నారని సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్ వార్తా సంస్థ తెలిపింది. మార్చి 1న భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య ఇండోర్‌లో మూడో టెస్టు ప్రారంభం కానుంది. ఇక కుటుంబంలో ఒకరికి తీవ్రమైన అనారోగ్యం కారణంగా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ కూడా స్వదేశానికి వెళ్తున్నాడు. అయితే అతను మూడో టెస్టు సమయానికి తిరిగి భారత్ చేరుకుంటాడు. ఒకవేళ కమిన్స్ మార్చి 1 లోపు రాకుంటే స్టీవ్ స్మిత్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. రెండో టెస్టులో డేవిడ్ వార్నర్ కంకషన్‌గా పెవిలియన్ చేరాడు. బంతి బలంగా చేతికి తాకడంతో అతను మైదానం వీడాడు. అతని స్థానంలో ట్రావిస్ హెడ్ ఆడాడు.

గ్రీన్, స్టార్క్ ఫిట్..!

ఆస్ట్రేలియా జట్టులో గాయం కారణంగా తొలి రెండు టెస్టులకు దూరమైన ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్, ఫాస్ట్ బౌలర్ మిచెల్ స్టార్క్ ఇండోర్ టెస్టుకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. అయితే... టెస్టు జట్టులో మార్పుల గురించి ఆసీస్ మేనేజ్‌మెంట్ బుధవారం అధికారికంగా వెల్లడించనుంది. దిల్లీ టెస్టులో భారత్ 6 వికెట్ల తేడాతో ఆసీస్‌ను చిత్తు చేసింది. ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా 10 వికెట్లతో ఆ జట్టు పతనాన్ని శాసించాడు. రెండో ఇన్నింగ్స్‌లో జడ్డూ 7 వికెట్లు తీయడంతో ఆసీస్ 113కే కుప్పకూలింది.

డబ్ల్యూటీసీ ఫైనల్‌కి...

నాగ్‌పూర్ టెస్టులో ఇన్నింగ్స్ 132 రన్స్‌తో ఇండియా, ఆస్ట్రేలియాను ఓడించింది. దాంతో బోర్డర్- గవాస్కర్ ట్రోఫీ నాలుగు టెస్టుల సిరీస్‌లో 2-0తో ఆధిక్యంలో ఉంది. అంతేకాదు.. ఈ ఏడాది వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ ఆడే దిశగా ముందడుగు వేసింది. ఇండోర్, అహ్మదాబాద్ టెస్టుల్లో ఏదో ఒకటి గెలిచినా కూడా టీమిండియా డబ్ల్యూటీసీ ఫైనల్ చేరుతుంది. ఇప్పటికే ఆస్ట్రేలియా ఫైనల్ బెర్తు ఖరారు చేసుకుంది. ఈ ఏడాది జూన్‌లో ఇంగ్లండ్‌లోని ఓవల్ స్టేడియంలో డబ్ల్యూటీసీ టైటిల్ పోరు జరగనుంది.

కోహ్లీ వారసత్వాన్ని రోహిత్ కొనసాగిస్తున్నాడు: గంభీర్

న్యూదిల్లీ: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భారత జట్టు జైత్రయాత్రపై మాజీ క్రికెటర్ గౌతం గంభీర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ టెస్టు జట్టు స్వరూపాన్నే మార్చేశాడని, రోహిత్ శర్మ అతని వారసత్వాన్ని కొనసాగిస్తున్నాడంతేనని గంభీర్ అన్నాడు. దిల్లీ టెస్టులో ఇండియా విజయం అనంతరం గంభీర్ స్టార్‌స్పోర్ట్స్‌తో మాట్లాడుతూ... 'నిజాయితీగా చెప్పాలంటే.. రోహిత్ శర్మ ఒక అద్భుతమైన కెప్టెన్. అయితే... ఈ ఫార్మాట్‌లో విరాట్ కోహ్లీ, అతని కెప్టెన్సీలో పెద్ద తేడా ఏం లేదు. కోహ్లీ ఈ జట్టును తీర్చిదిద్దాడు. రోహిత్ అతని మార్గాన్నే అనుసరిస్తున్నాడు. స్పిన్నర్లు అశ్విన్, జడేజాలను కోహ్లీ ఉపయోగించుకున్న తీరు అద్భుతం. ఇప్పుడు రోహిత్ కూడా అదే చేస్తున్నాడు. షమీ, సిరాజ్, బుమ్రా, జడేజా, అశ్విన్, అక్షర్‌పటేల్ అద్భుతంగా రాణిస్తున్నారు' అని ఈ మాజీ ఓపెనర్ తెలిపాడు. అంతేకాదు స్వదేశంలో అదరగొడుతున్నరోహిత్‌కు కెప్టెన్‌గా ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా పర్యటనలు సవాల్ విసురుతాయని వెల్లడించాడు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.